## ఘనంగా నాగులచవితి వేడుకలు

గాజువాక, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి సందర్భంగా గాజువాక నియోజకవర్గంలో భక్తి శ్రద్దలతో ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువ జామున లేచి చిమ్మిలి, చలిమిడి, వడపప్పు, గుడ్లు, పాలు, చెరుకు వంటి పదార్ధాలను సిద్ధం చేసుకొని పుట్టకు వేసి కుటుంభ సమేతంగా పాలు పోశారు. పుట్ట వద్ద బాణసంచా కాల్చి పండగ వాతావరణం తీసుకొచ్చారు.



87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ కుటుంభ సమేతంగా చవితి పండగను చేశారు. అనంతరం ప్రజలందరికీ నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు.

69వ వార్డు నాతయ్యపాలెంలో వార్డు వైసీపీ అధ్యక్షులు, ఏపీ ఔట్ సోర్సింగ్ డైరక్టర్ బోగాది సన్యాసిరావు కుటుంభంతో కలిసి పుట్టకు వెళ్లి నాగుల చవితి పండగను నిర్వహించారు. ప్రజలంతా సుఖ:సంతోషాలతో ఉండాలని ప్రార్ధించామన్నారు.

కణితికాలనీలో 87వ వార్డు వైసీపీ సీనియర్ నాయకులు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి దుగ్గపు దానప్పలు, జిల్లా వైసీపీ కార్యదర్శి బొడ్డ గోవిందలు తమ తమ కుటుంభాలతో పుట్టకు వెళ్లి పాలు పోసి తీర్ద ప్రసాదాలను స్వీకరించారు.





## కేంద్రమంత్రి నిర్మల సీతారామన్‌కు ఘన వీడ్కోలు పలికిన నేతలు

గాజువాక, అక్టోబర్ 29, ప్రభాతవార్త



విశాఖ పర్యటన ముగించుకొని తిరిగి ఢిల్లీకి పయనమైన కేంద్ర ఆర్ధిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు విశాఖ ఎయిర్‌పోర్టులో రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ పీవీఎన్ మాదవ్, జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్‌రాజుతో కలిసి ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ సభ్యులు, గాజువాక నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. విశాఖలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలను నిర్మలా సీతారామన్‌కు వివరించారు. పార్టీ పటిష్టతకు చేయవల్సిన సూచనలను, సలహాలను నిర్మలాసీతారామన్ దిశ నిర్దేశం చేశారు.

## వైద్య వృత్తిలో నైపుణ్యాలు పెంచుకోవాలి

పిఎంపాలెం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం దంతవైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో 16వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్యాచులర్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (బిడిఎస్), మాస్టర్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (ఎండిఎస్) కోర్సులు పూర్తి చేసుకున్న 286 మంది వైద్య విద్యార్ధులకు ఈ సందర్భంగా డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యుడు గురుగోవిందసింగ్ ఇంద్రప్రస్థ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ) వైస్ ఛాన్సలర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మహేష్ వర్మ స్నాతకోత్తర డిగ్రీలను అందజేశారు. దంత వైద్య విద్యార్థిని డాక్టర్ అల్లెన శ్రావ్యకి డిగ్రీ పట్టాను అందజేశారు. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యుడు గురు గోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తరలింపు సంగతి తేల్చండి

### -బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదు : టీడీపీ నేత కొప్పిశెట్టి వెంకటేష్

నక్కపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నక్కపల్లి ఇసుక ర్యాంపులో జరుగుతున్న అక్రమాలపై ఎందుకు దృష్టిపెట్టడం లేదని బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండల టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, తహశీల్దార్ సుబ్రహ్మణ్య శాస్త్రిని కలసి అడిగారు. గత కొద్దిరోజులుగా క్రితం నుంచి ఇసుకలో అక్రమాలు జరుగుతున్నాయని, తూర్పుగోదావరికి తరలిపోతుందని రెండురోజుల క్రితం కూడా ఇసుక తరలిపోతున్న విషయం పట్టుకున్న మూడు వాహనాలు కూడా అప్పజెప్పినప్పటికీ ఆ వాహనాలు సంగతి ఏమైంది. వారిపై ఎందుకు పోలీస్ కేసునమోదు చేయలేదని నిలదీశారు. పేదలు ఇసుక లేక ఇబ్బంది పడుతుంటే ఇలా పక్క ప్రాంతాలకు ఎటువంటి రశీదు లేకుండా ఇసుక తరలిపోతుంటే మీ దృష్టికి రాలేదా అంటూ అడిగారు. తహశీల్దార్ సుబ్రహ్మణ్య శాస్త్రి పట్టుబడిన వాహనాలను కార్యాలయ సమీపంలో తలయారీలను కాపాలా పెట్టి ఉంచామని తహశీల్దార్ చెప్పగా, రాత్రి సమయాల్లో వారిని బెదిరించి తీసుకుపోయారని, అసలు ఏం జరుగుతుందని, ఇది చాలా దారుణమైన విషయమని తహశీల్దార్ ఎదుట టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బాధ్యులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఎటువంటి పర్మిట్‌లు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాల సంగతి తేల్చాలని, పోలీస్ కేసు నమోదు చేయాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు కళ్లెం వేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు తహశీల్దార్‌ను కలసిన వారిలో జిల్లా నాయకులు గింజాల లక్ష్మణరావు, వైబోయిన రమణ, ఆకేటి శాంతి, అయినంపూడి అప్పలరాజు, కొండ్ర కనకారావు, గింజాల శ్రీను, కోసూరి శ్రీను, అద్దూరి లోవరాజు, అల్లాడ రాము, సన్యాసిరావు, తాతారావు, కర్రి వెంకట సత్యనారాయణ ఉన్నారు.

## రాజయ్యపేటలో డెంగ్యూ కేసు నమోదు

### - అప్రమత్తమైన అధికారులు, వైద్యసిబ్బంది - యుద్దప్రాతిపదికన శానిటేషన్ పనులు

నక్కపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త



మండలంలోని రాజయ్యపేట గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో అటు అధికారులు, ఇటు పంచాయితీ సిబ్బంది, వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామ సర్పంచ్ పిక్కి అప్పలనర్స హుటా హుటిన గ్రామంలో స్ప్రే చేయించి, యుద్దప్రాతిపదికన పారిశుద్య పనులు చేపట్టారు. గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలికకు డెంగ్యూ సోకినట్లు వైద్య పరీక్షల్లో గుర్తించారు. ఈమేరకు విషయం తెలుసుకున్న గొడిచర్ల పిహెచ్‌సి సిబ్బంది, పంచాయితీ సర్పంచ్ అప్పలనర్స, జెడ్పిటిసి గోసల కాసులమ్మ, గ్రామంలో ముందసు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గ్రామం మొత్తం స్ప్రే చేయించారు. వారితో పాటు పిక్కి కామేశ్వరరావు, కార్యదర్శి పి.వి.పి. రాజశేఖర్, వార్డు సభ్యులు సత్తయ్య, కొండలరావు, వైద్యసిబ్బంది సత్యనారాయణ, ఎం.పార్వతి, వెంకట లక్ష్మిలు ఉన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ స్పందించి గ్రామంలో అందరినీ అప్రమత్తం చేయడం పట్ల సర్పంచ్‌ని అభినందించారు.



## ఘనంగా నాగులచవితి వేడుకలు

కశింకోట, అక్టోబరు 29, ప్రభాతవార్త



మండలంలో శనివారం నాగులచవితి వేడుకలు ఘనంగా భక్తిశ్రద్దలతో నిర్వహించారు. కుటుంబ సమేతంగా నాగేంద్రుని పుట్టల వద్దకు వెళ్ళి వసుపుకుంకుమ, పండ్లు, కాయలు, పుష్పాలతో పుట్టల వద్ద ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్దలతో భక్తులు పూజలు చేశారు. తమ మొక్కులు చెల్లించి నాగేంద్రస్వామి వారిని వేడుకున్నారు.

## ఇంట్లోనే పాములపుట్ట..

### 20 ఏళ్లుగా నాగులచవితి రోజు ప్రత్యేక పూజలు

పాడేరు, అక్టోబర్ 29,ప్రభాతవార్త



పాములపుట్ట నివసిస్తున్న ఇంట్లోనే పుట్టడంతో ఆపుట్టకు గత 20 సంవత్సరాలుగా నాగుల చవితి రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తూ ఆ పుట్ట పుట్టిన ఇంటి గదిని పూజా మందిరంగా మార్చిన గిరిజన మహిళ ఉదంతమిది. పెదబయలు మండలం కిముడుపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న తలారి నీలమ్మ ఇంట్లో గత 20 సంవత్సరాల క్రితం పాములపుట్ట వెలిసింది. దీంతో నీలమ్మ సాక్షాత్తు నాగేంద్రస్వామి ఇంట్లో వెలిసారడని విశ్వాసంతో పాములపుట్టను తొలగించకుండా పుట్ట వెలసిన గదిని పూజా మందిరంగా ఏర్పాటు చేసి పాములపుట్టకు నీలమ్మ అలాగే ఆ గ్రామనికి చెందిన గిరిజనులు ప్రత్యేక పూజలు చేస్తూ పూజిస్తున్నారు. ప్రతీ ఏడాది వచ్చే నాగులచవితి రోజున తలారి నీలమ్మతో పాటు వారి కుటుంబ సభ్యులు,కిముడుపల్లి గ్రామంలో ప్రజలు ఇంట్లో వెలసిన పాములపుట్టు వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేయడమే కాకుండా పుట్టలో పాలు పోయడం గ్రుడ్ల వేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ ఏడాది కూడా నాలుగచవితి పండుగను ఇంట్లో ఉన్న పుట్టవద్దే ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు పోసి గ్రుడ్లు పుట్టలో వేసారు.తన ఇంట్లో పుట్ట వెలిసి ఉండటం వలన అన్నీ శుభకార్యాలే జరుగుతున్నాయని తలారి నీలమ్మ పేర్కొన్నారు.

## నిర్మలా కిషోర్‌కు ఘన సత్కారం

గాజువాక, అక్టోబర్ 29, ప్రభాతవార్త



గాజువాక పాత కర్ణవానిపాలెంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు క్యాంపు కార్యాలయంలో బీజెపి రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి నిర్మలాకిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం రివ్యూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ఉమ్మిడి సుజాత అధ్యక్షత వహించారు. ముందుగా స్దానిక నాయకురాలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీమతి రోహిని నియోజకవర్గంలో మహిళ మోర్చా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని వివరించారు. ఈ సందర్భంగా నిర్మలా కిషోర్ మాట్లాడుతూ మరో 10 రోజుల్లో ఓటరు నమోదు సమయం పూర్తవుతుంది కాబట్టి ఇప్పటివరకు ఇచ్చిన అప్లికేషన్లు సంభందిత తహశీల్దార్ కార్యాలయంలో, జీవీఎంసీ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. కార్యక్రమంలో పి.లక్ష్మీసంతోషి, శ్రీదేవి, జీలకర్ర భువనేశ్వరి, కట్టా పద్మ, పుష్పలత, గీతాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పేట ఎల్‌టి కాలనీ వద్ద వైద్య పరీక్షలు

పాయకరావుపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త



పాయకరావుపేట పట్టణ పిహెచ్‌సి పరిధి ఎల్‌టికాలనీ ప్రాంతం వద్ద శనివారం ఫ్యామిలీ కాన్సెప్టు క్లినిక్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీస్త్రీలు బాలింతలను బిపి, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్, పక్షవాతం, గుండెజబ్బులు, తదితర వ్యాదులతో బాదపడుతున్న రోగులు అందరికీ పిహెచ్‌సి వైద్యాదికారిణి పద్మశ్రీ, 104 వైద్యాధికారి బత్తులరత్నశేఖర్ సంయుక్తంగా పరీక్షలు చేసి మందులు పంపిణీచేశారు. 41మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మీ యొక్క అనారోగ్య సమస్యలు ఉంటే ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టు క్లినిక్‌ద్వారా వైద్యసేవలు తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమాన్ని జెడ్పీటీసి లంకసూరిబాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్‌నాగేశ్వరరావు, ఇవో రమణ. విజయకుమార్, హెల్త్ అసిస్టెంట్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం-బాధితునికి సహాయం



పాయకరావుపేట రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త

విద్యుత్‌షార్టుసర్క్యూట్ ప్రమాదంలో పూరిగుడిశె దగ్ధం చెందింది. పాయకరావుపేట మండలం శ్రీరామపురం గ్రామంలో గతరోజురాత్రి జరిగిన ప్రమాదంలో జి చంటి గుడిశెపూర్తిగా దగ్ధం చెందడంతో బాదితునకు సహాయం చేయడంలో సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ స్పందించారు. ఈ విషయాన్ని తహసిల్దారు జయప్రకాష్‌కు తెలియచేసారు. బియ్యం, వంటనూనె, పప్పులు వంటి నిత్యావసర సరుకులను బాదితకుటుంబానికి అందచేసారు.

## శ్రీరామపురంలో ఇంటింటికీ పైపులైనులు

పాయకరావుపేట రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త



పాయకరావుపేట మండలం శ్రీరామపురం గ్రామంలో శనివారం కాపువీదిలో ఇంటింటికీ త్రాగునీటి పైపులైనులు వేసే కార్యక్రమం జరిగినట్లు సర్పంచ్ గారాక్రిష్ణప్రసాద్ తెలియచేసారు. గ్రామంలో తాగునీటిసౌకర్యాల కల్పనలో భాగంగా పైపులైనులు వేస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. ఇంటింటికీ పైపులైనులు ఏర్పాటుచేయడం ద్వారా తాగునీటి ఇబ్బందులు దీంతో తొలగుతాయన్నారు.

## నాటుసారాపై జరిపిన దాడుల్లో 40 లీటర్లు సారాతో పాటు ఒకరి అరెస్ట్



నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

నక్కపల్లి, పాయకరావుపేట మండలాలలో నాటుసారాపై జరిపిన దాడుల్లో 3 కేసులు నమోదుచేసి ఒకవ్యక్తిని అరెస్టు చేశామని 40 లీటర్లు సారాతో పాటుగా ఒకద్విచక్రవాహనం, 1550 లీటర్లు సారాపులుపు ధ్వంసం చేసినట్టు ఎస్‌హెచ్ఒ ఎస్ఇబి ఎన్‌ఫోర్సు మెంటు సిఐ తేజోవెంకటకుమార్ తెలియజేశారు. నక్కపల్లి మండలం సిహెచ్‌లక్ష్మీపురం గ్రామంలో 350 లీటర్లు వాష్‌ను ధ్వంసం చేశామని అలాగే చినదొడ్డిగల్లు గ్రామంలో 1200 లీటర్లు వాష్ ధ్వంసం చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట మండలం ఈదటం గ్రామంలో 40 లీటర్లు నాటుసారా అలాగే ద్విచక్రవాహనాన్ని స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. ఎస్‌రాయవరం మండలం గుర్రాజుపేటలో నాటుసారా తయారీ అమ్మకాలు వల్ల కలిగే అనర్ధాలు కేసులు ఇబ్బందులు తదితర అంశాల పట్ల అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్టు ఎన్‌ఫోర్సు మెంటు సిఐ తేజోవెంకటకుమార్ తెలియజేశారు.



## ఘనంగా నాగుల చవితి పండుగ

మాకవరపాలెం అక్టోబరు 29 ప్రభాతవార్త



మండలంలోని అన్ని గ్రామాల్లో నాగుల చవితి పండుగ అత్యంత సాంప్రధాయ పద్దతిలో జరుపుకున్నారు. ఈమేరకు శనివారం తెల్లవారు జామునుంచే గ్రామాల్లో ప్రతీ ఇంట సోభాయమానంగా అలంకరించుకున్నారు. ప్రధానం పల్లెలో రైతులు నిత్యం పంట పొలాల్లో తిరిగే వారికి నాగులు కనిపించడం పరిపాటి. అందుకే రైతులు ప్రధానంగా వారి భూముల్లోనే పట్టల వద్ద నాగరాజుకు పూజలు చేస్తుంటారు. మండలంలో ఏగ్రామంలో చూసినా ప్రజలు మరి ముఖ్యంగా మహిళలు గుంపులు గుంపులుగా తరలి వెళ్లి పట్టల్లో పాలు,గుడ్లు పోసేందుకు వెళ్లారు. నిత్యం పంటపొలాల్లో తిరిగే తమకు నాగురాజు నుంచి ఎటువంటి ప్రమాధం సంబవించకుండా చల్లగా చూడాలంటూ వారి పూజలు చేశారు.

## అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఘనంగా నాగులచవితి పండుగ

### పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ పుట్ట వద్ద ప్రత్యేక పూజలు

పాడేరు, అక్టోబర్ 29,ప్రభాతవార్త



అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అల్లూరి జిల్లా మన్యంలో నాగులచవితి పండుగను ప్రజలు భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. శనివారం నాగులచవితి పండుగ కావడంతో పుట్టులోఉన్న నాగేంద్రునికి ప్రత్యేక పూజలు చేసి పుట్టులో పాలు, గ్రుడ్లు పోసి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. పుట్ట పూజలు చేసి పాలు పోయడానికి ప్రజలు పుట్టల కోసం భక్తులు పొలాలను, కొండలను వెతుకుతూ పుట్టలు కనిపించడంతో పుట్ట ఉన్న ప్రదేశాన్ని శుభ్రం చేసి భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో కోడి గ్రుడ్లు, పాలు తదితర వాటిని పుట్టలో పోసిన అనంతరం నాగేంద్రునికి ప్రత్యేకంగా పూజలు భక్తిశ్రద్దలతో



చేశారు. పుట్ట వద్ద మందుగుండు సామాగ్రి కాల్చుతూ నాగుల చవితి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేసేందుకు కుటుంబ సమేతంగా అందరూ కలసి వెళ్లడంతో పుట్ట దగ్గర భక్తులతో కిటకిటలాడింది.నాగులచవితి పండుగను అల్లూరి మన్యంలో ప్రతీ గిరిజన గ్రామాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పాడేరు సెయింటెన్స్ కాన్వెంట్ ఎదురుగా ఉన్న పెద్ద పుట్ట వద్ద పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ కుటుంబ సభ్యులతో వచ్చి పుట్టవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టలో పాలు, గ్రుడ్డను పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పట్టభద్రుల ఎన్నికలకు సంబందించి అర్హత గల అందరూ ఓటర్లగా నమోదు చేసుకోవాలి

నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టబద్రుల నియోజకవర్గం ఎన్నికలకు సంభందించి ఈనెల 1నుండి వచ్చేనెల నవంబర్ 7వ తేదీవరకూ ఫారం18లో డిగ్రీ అలాగే దానికి సమానమైన అర్హతగల అందరూ ఓటర్లగా నమోదు చేసుకోవలసిందిగా అలాగే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌ద్వారా ధరఖాస్తులు చేసుకోవచ్చునని తహసిల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి తెలియచేసారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఉన్న ఓటర్లుకు ఈ విధంగా తెలియచేసారు. సహాయక ఓటర్ల అధికారులు (తహశీల్దార్లు) కోటవురట్ల, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం అలాగే డిజిగ్నేటివ్ అధికార్లుగా మండలప్రజాపరిషత్ అభివృద్ది అధికారులు కోటఉరట్ల, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం వారియొక్క కార్యాలయంలో అలాగే బూత్‌స్థాయి అధికారులుగా పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ వారికి సంభందించిన గ్రామాల్లో జిల్లాకలెక్టర్ వారి ఆదేశాల మేరకు 30వ తేదీన స్పెషల్‌క్యాంపు యాన్‌డే ఉన్నందున ఫారం 18 అప్లికేషన్లు వారివద్ద అందుబాటులో ఉంటాయని అవి తీసుకుని వాటితోపాటు డిగ్రీ అర్హత, నివాసం, ఆధార్ కార్డునకలు వీటిమీద గెజిటెడ్ అధికారిచే సంతకం చేయించి దర ఖాస్తుతో పాటుసంబందిత నకల్లు జతపరచి అన్నికార్యాలయాల్లో స్వీకరించడం జరుగుతుందని తెలియచేసారు.

## నాగులచవితి నాగేంద్రుడి ప్రత్యేక పూజలు

గొలుగొండ, అక్టోబర్ 29, ప్రభాతవార్త



భక్తి శ్రద్దలతో ప్రతీఒక్కరు నాగులచవితి పండగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఒక్కరు కుటుంబ సమేతంగా చివితికి పుట్టలో పాలు పోసేందకు తమ తమ పంటపొలాల్లో ఉన్న పుటట్లవద్దకు తరలివెళ్లారు. పిత్రు దేవతలకు వడ్డనలు చేసి చెరుగడలు మూనచేర్చి పూజలు జరిపారు. అనంతరం బయలుదేరి పుట్టవద్దకు చేరుకొని పుట్టను శుభ్రంచేసి అలంకరించి కొత్త నాగుల పంచిని పుట్టపై ఉంచి పూజలు జరిపారు. తమ పేర్లపై నాగేంద్రుడికి గుడ్లు వైసి చలివిడి, సిమ్మిడి పుట్టలో వేసి ఆవుపాలతో నాగేంద్రుడికి పాలాభిషేకం చేశారు. పిల్లలు పెద్దలు ప్రతీ ఏడాదిలాగే సమూహంగా తరలివెళ్ళి సంతోషంగా పూజలు చేసి తమ యందు కరుణ చూపాలని కోరుకున్నారు. పగలు రాత్రి వేళ్లల్లో పంటలను కాపాడేందుకు తిరిగే తమను కాపాలని కోరుకుంటూ పూజించారు.

## కోర్కెలు తీర్చే నా'రాజా'.. కరుణించి కాపాడు నాగరాజా

### మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్దలతో 'నాగులచవితి'



కొయ్యూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త

శనివారం మండలంలోని పలుగ్రామాల్లో నాగుచవితి పండగ సంధర్భంగా భక్తులు భక్తిశ్రద్దలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కోర్కెలుతీర్చే నాగన్నా,కరుణించి కాపాడు నాగరాజా..అంటూ ఇంటిల్లిపాది భక్తులు పిల్లాపాపలతో గ్రామాలకుదరిలోని చేలల్లోని నాగుపాముపుట్టలవద్దకు చేరుకుని పాలు,గుడ్లు తదితర సాంప్రదాయ వంటకాలతో నాగేంద్రునికి నైవేద్యంపెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలవద్ద సాంప్రదాయంగా టపాసులు పేల్చుతూ సందడిచేశారు. పలుగ్రామాల్లోని పొలిమేరలన్నీ నాగులచవితి పండగసందడితో కళకళలాడాయి. ఈ ఏడాది సాంప్రదాయ దీపావళి పండగకళ మండలంలో ఏమాత్రం కానరాకపోవడంతో సాంప్రదాయ పండగ ప్రియులు కొంతనిరాశకు లోనయ్యారు. శనివారం నాగులచవితి సంధర్భంగా మాత్రం ప్రతీగ్రామంలో పండగ కళ చోటుచేసుకుంది. మండలకేంద్రమైన రాజేంద్రపాలెం, కొయ్యూరు, సూరేంద్రపాలెం, శింగవరం తదితర గ్రామాల్లో గతేడాదికంటే ఈ ఏడాది నాగులచవితి పండగ సందడి పెరిగినట్టు కనబడింది.

## ప్రజలకు సుఖశాంతులు, అష్టఐశ్వర్యాలు కలగాలి

### నాగులచవితి ప్రత్యేక పూజలో అరకు ఎంపి మాధవి దంపతులు

కొయ్యూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త



ప్రజలకు సుఖశాంతులు, అష్టఐశ్వర్యాలు కలుగజేయాలి తండ్రీ'అంటూ అరకుఎంపి గొడ్డేటిమాధవి, శివప్రసాద్ దంపతులు నాగులచవితి పండగసంధర్భంగా శనివారం నాగేంద్రునికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలంలోని తమ స్వగ్రామమైన శరభన్నపాలెంలో సాంప్రదాయవస్త్రధారణతో నాగరాజు పుట్టవద్ద ఎంపిమాధవి దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించడం చూపరులను ఆకట్టుకుంది. నిత్యం ఏదోఒక సేవాకార్యక్రమం లేదా, ప్రభుత్వ కార్యక్రమంలో నిమగ్నమై బిజీబిజీగా ఉండే అరకు ఎంపి మాధవి, భర్త శివప్రసాద్ సాంప్రదాయ నాగులచవితి పండగకు ప్రత్యేకప్రాధాన్యత నిచ్చి పూజలు నిర్వహించడం సాంప్రదాయ పండగలను గౌరవించడమే నంటూ పలువురు అభిప్రాయడుతున్నారు. ఈ ప్రత్యేకపూజల్లో ఎంపిమాధవి కుటుంబీకులు, పలువురు గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుకై ప్రతీఒక్కరూ కృషిచేయాలి

### మండల సమావేశంలో టిడిపి నేతల తీర్మానం



కొయ్యూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త

పార్టీ సభ్యత్వ నమోదుకై ప్రతీఒక్కరూ తమవంతు కృషిచేసి తద్వారా పార్టీని మరింత బలోపేతంచేసుకోవాలని మండల టిడిపినేతలు తీర్మానించారు. శుక్రవారం మండలంలోని కొయ్యూరులో మండల టిడిపిప్రధాన కార్యదర్శి తోటదొరబాబు ఇంటి వద్ద మండల టిడిపినేతలు సమావేశంలో నిర్వహిం చారు. ఈ సంధర్భంగా పంచాయితీలవారీగా బాధ్యులను గుర్తించి ఆన్‌లైన్‌ద్వారా సభ్యత్వాలు నమోదు చేసేవిధంగా లింకులను ఇవ్వడం జరిగింది. ఈ సంధర్భంగా టిడిపినేతలు మాట్లాడుతూ పార్టీకుటుంబ సభ్యులంతా విధిగా భ్యత్వంచేయించుకోవాలని, అలాగే మరొకరితో సభ్యత్వం నమోదుచేయించాలని కోరారు. కేవలం రూ.వందతో పొందిన టిడిపిసభ్యత్వంతో రూ.2లక్షల భీమా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొలిసింగిసత్యనారాయణ, ప్రధానకార్యదర్శి తోట దొరబాబు, రాష్ట్రఎస్టీసెల్ కార్యదర్శి కొర్రరామమూర్తి, పాడేరు నియోజకవర్గ ఐటిడిపి ఇన్‌ఛార్జి బుద్ద జ్యోతికిరణ్, పాడేరు మండల పార్టీ అధ్యక్షులు కె.రామునాయుడు, మండల ఐటిడిపి ఇన్‌ఛార్జి కురుజుశ్రీనుబాబు, జి.మాడుగుల ఐటిడిపి ఇన్‌ఛార్జి చిరంజీవి, మండలటిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పొటుకూరిసన్యాసిరావు, సీనియర్‌నేతలు వై.వరహాలబాబు, పల్లాలఅబ్బాయిరెడ్డి, వజ్రపురవణ, చేపలప్రసాద్, కిలెబాలరాజు, నవరంగి వెంకటరావు, మాజీసర్పంచ్ శంకర్రావు, సొసైటిమాజీడైరెక్టర్ అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకంలో సందడే సందడి

**పర్యాటకులను ఆకట్టుకుంటున్న మాడుగుల ప్రాంతం -వన సమారాధనకు మరో పేరు టేకు తోట**

**మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త**



కార్తీక మాసం వచ్చిందంటే మాడుగుల ప్రాంతం అంతా సందడితో నెలకొంటుంది. పర్యాటకలను ఆకర్షించే ఎన్నో ప్రాంతాలు ఇక్కడ చూడవచ్చు. ముఖ్యంగా పూర్వకాలం నుంచి అడవిలో ఉన్న టేకు తోటలు వన సమా రాధనకు మారుపేరుగా నిలిచాయి. అయితే ఈ పర్యాటక ప్రాంతంలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో వచ్చినవారు చీకటి పడేసరికి వెనుతిరిగి తప్పడం లేదు. మాడుగుల పర్యా టక ప్రాంతాల గురించి ఒకసారి పరిశీలిస్తే మాడుగులకు రెండు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో శ్రీ ఉబ్బలింగేశ్వర స్వామి వారు కొలివై ఉన్నారు. చుట్టూ పచ్చని చెట్లు ఎత్తైన కొం డలు మధ్యన జలపాతాలు పర్యటనను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఈ ఆలయం వెనకనుం చి దేవపురం దెప్పాడ వంటి అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయి. పేరుకే అవి అల్లూరు జిల్లాలో ఉన్నప్పటికీ అన్ని అవసరాలకు మాడుగుల రావాల్సిందే. ఈ నేపథ్యంలో మాడుగుల నుంచి దేవ పురానికి రహదారి నిర్మాణం చేపట్టి ఇరు ప్రాంతాలకు రహదారి రవాణా సౌకర్యాలు కల్పించాల ని భావించారు. అయితే గతంలో ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం వరకే తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. సాంకేతికమైన సమస్యలు మూలంగా రిజర్వ్ ఫారెస్ట్ మీదుగా నిర్మాణం చేపట్టలేకపో యారు. తాజాగా అడ్డంకులు తొలగిపోవడంతో గుడి నుంచి దేవపురానికి రహదారి నిర్మాణం ప్రారంభించారు. ఇది పూర్తయితే గిరిజన ప్రాంతాల వారు మాడుగులకు రాకపోకలు సాధించడం ద్వారా పర్యాటపరంగా మరింత అభివృద్ధి సాధించవచ్చు. ఇక మరో ఆధ్యాత్మిక కేంద్రం వారి ఆలయం ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత, ఈ ప్రాంత ఇలవేల్పు శ్రీ మాలికొండమ్మ అమ్మవారు. ఆలయం ఎంత పచ్చని వాతావరణంతో కూడి పక్కనే చెరువు అనుకొని పాండవుల గిరి మురి పక్క తులసి కళ్యాణ మండపం, అక్కడ నుంచి కొంత దూరం వెళ్తే రామచంద్రపురంలో అక్వి డేట్స్ వంటివి పర్యాటకలను ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా మోదమ్మ ఆలయం వద్ద గల పాండ వులు చెరువును అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ఎందరో పర్యాటకులు రాగలరని భావిస్తున్నారు. జాలంపల్లి సమీపంలో పురాతన పిట్టగెడ్డ శివాలయం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. పూర్వం మంచి వంశీయులు ఈ ప్రాంతం రాజ ధానిగా ఉన్నప్పుడు ఆలయం దేదీప్యమానంగా వెలుగేదని చెబుతుంటారు. ఈ ఆలయానికి వెళ్లే మార్గంలోనే మావుళ్ళమ్మ అమ్మ ఆలయం ఉంది. రాష్ట్రంలో ఒకటి రెండు ప్రాంతాలు ఈ అమ్మవారి ఆలయం ఇలాంటి భారీ విగ్రహం ఎక్కడ ఉండవు. మాడుగుల మహారాజు కోట కూడా చూడవలసింది. దీనికి యుద్ధ కోట అనే పేరు కూడా ఉంది. ప్రస్తుతం ఈ కోట మహా రాణి వారసులు విశాఖ మహారాణి పేటలో ఉంటున్నారు. ఈ కోటను అభివృద్ధి చేయాలని వారి వారసులు ఇటీవలే ప్రయత్నం చేస్తున్నారు. ఇంత ప్రాశస్త్యంతో కూడిన మాడుగుల ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందగలదని, ఈప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

## అనారోగ్యం రూపంలో నిరుపేద కుటుంబాన్ని కబలించిన విధి

**తల్లి ఛితి ఆరకముందే తనువు చాలించిన కుమారుడు -అనాధగా మిగిలిన కుమార్తె -మండల కేంద్రంలో విషాదం**

**ముంచంగి పుట్టు, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



మండల కేంద్రంలో ఓ నిరుపేద గిరిజన కుటుం బాన్ని అనారోగ్య రూపంలో విధి కబలించడం తో తల్లి మృతి చెంది ఛితి ఆరకముందే తల్లిని తలుచుకుంటూ కుమారుడు సైతం మృతి చెందాడు. దీంతో ఉన్న ఒక్కగాని ఒక్క కుమార్తె అనాధగా మిగిలిన సంఘటన ముంచంగిపుట్టు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. దీంతో మండల కేంద్రంలోవిషాద ఛాయలు అలముకు న్నాయి. అందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గంపరాయి కృష్ణ, గంపరాయి పుష్పతో పాటు గంపరాయి సాయి మరో కుమారుడు కుమార్తె. వీరంతా నిరుపేద గిరిజన కుటుంబం కూలి పనులు చేసుకుంటూ వచ్చిన దాంట్లో కుటుంబాన్ని పోషించుకుంటూ జీవితం సాగిస్తున్నారు. ఆనందంగా సాగుతున్న వీరి కుంబాన్ని చూసిన విధికి కన్నుకుట్టి 8 ఏళ్ల క్రితం జీపు ప్రమాదంలో ఓ కుమారుడ్ని విధి కబలించగా, ఏడాది క్రితం కుటుంబపెద్దని గంపరాయి కృష్ణను అనారోగ్య రూపంలో విధి కాటేసింది. ఆ కుటుంబం చిన్నాభిన్నమై తల్లి ఓ కుమారుడు కుమార్తె మాత్రమే మిగిలారు. దీంతో ఉన్న తల్లి ముగ్గురు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో విధి మరలా కన్నెర్ర చేసింది. తల్లి గంపరాయి పుష్ప గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం అర్ధరాత్రి తనువు చాలించింది. శుక్రవారం ఉదయం తల్లి అంత్యక్రియలు నిర్వహించి ఇంటికి చేరుకున్న కుమారుడు గంపరాయి సాయి మనోవేదనకు గురై అకస్మాత్తుగా శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందడంతో ఉన్న ఒక కుమార్తె అనాధగా మిగిలిపో యింది. విధి ఆడిన ఈ వింత నాటకంలో కుటుంబం మొత్తం అనారోగ్యంతో బారిన పడి మృతి చెందడంతో చుట్టుపక్కల వారు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసు కున్న పలువురు నాయకులు చుట్టుపక్కల వారు అనాధగా మిగిలిన కుమార్తెను ఓదార్చారు. అనాధగా మిగిలిన కుమార్తెను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఓటరుగా నమోదు చేసుకోండి

**నవంబర్ 7 నమోదుకు తుది గడువు : డిఆర్ఓ దయానిధి**

**పాడేరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

నవంబర్ ఒకటవ తేదీ నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై మూడేళ్ళు పూర్తి చేసినవారందరూ (2019 అక్టోబర్ 31నాటికి డిగ్రీ పూర్తి చేసినవారు) నవంబర్ 7వ తేదీలోగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. గడువు తేదీ సమీపిస్తున్నందున త్వరగా నమోదు చేయించుకోవాలని కోరారు. అర్హులందరూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఫారం 18 పూరించి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అతికించి, డిగ్రీ పాసైన ధృవపత్రం జిరాక్స్ ప్రతిని జతపరచి నివాస ఆధారంగా సంబంధిత మండల కార్యాలయంలో అందజేయాలని డిఆర్ఓ వివరించారు. అదే విధంగా ఫారం 18లో శాసనసభ ఎన్నికల ఓటరు జాబితాలో ఉన్న దరఖాస్తుదారుని వివరాలు పొందుపరచాలని సూచించారు. ఓటరు నమోదు అధికారికి దరఖాస్తు అందజేసిన తరువాత తప్పనిసరిగా రశీదు పొందాలని డిఆర్ఓ సూచించారు. జిల్లా ప్రధానాధికారులు అర్హత కలిగిన వారి కింది స్థాయి సిబ్బందితో ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని డిఆర్ఓ కోరారు. అదేవిధంగా అన్ని సచివాలయాలలో అర్హులైన సిబ్బంది కూడా ఓటరు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటరు నమోదుతో మంచి వ్యక్తిని ప్రజా ప్రతినిధిగా ఎన్నుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## చవితి వేడుకల్లో ఉపముఖ్యమంత్రి

**మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త**



నాగుల చవితి పర్వదిన వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కుటుంబ సమేతం గా పాల్గొన్నారు. తమ స్వగ్రామమైన దేవరపల్లి మండలం తారువ గ్రామంలో సాంప్రదాయబద్ధంగా పుట్టలో పాలు వేసి నాగేంద్రని పూజించి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ మన సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ భగవంతునీ పట్ల కృతజ్ఞతభావంతో మెలగాలని కోరారు.

## చవితి వేడుకల్లో ఎంపీపీ రాంబాబు



**పద్మనాభం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

నాగుల చవితి వేడుకలను మండలంలోని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం ఉదయం నుంచి భక్తులు వారి వారి గ్రామాల్లో ఉన్న పుట్టల దగ్గరకు చేరుకుని నాగ దేవతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మద్ది గ్రామంలోని పద్మనాభం ఎంపీపీ కే రాంబాబు కుటుంబ సభ్యులతో నాగదేవత పూజలు చేసి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులు పుట్టలను పూలతో సుందరంగా అలంకరింప చేసి పుట్టలో పాలు గుడ్లు చలిమిడి వేసి నాగదేవతకు పూజించారు.

## మెదడు ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం అవసరం

**విశాఖపట్నం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



ప్రతి 6 సెకండ్లకి పక్షవాతం బారిన పడినవారు ఒకరు చనిపోతున్నారని మెదడు ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికి అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రజల్లో అవగాహన కల్పించడానికి అను హాస్పిటల్స్ వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా ఆర్కే బీచ్‌లో 5కే రన్ కార్యక్రమం నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ డా.కె.శ్రీదేవి మాట్లాడుతూ పక్షవాతం వచ్చిన వెంటనే వీలైనంత త్వరగా హాస్పిటల్‌కి తీసుకువచ్చిన యెడల మెదడుకి దీర్ఘ కాలిక నష్టం జరగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. డా.లలిత మాట్లాడుతూ పక్షవాతం రాకుండా మన జీవన విధానంలో సరైన మార్పులు చేసుకుంటే జబ్బు బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు అని చెప్పారు. డా.ఎంజివి ఆదిత్య మాట్లాడుతూ పక్షవాతం పైన సరైన అవగాహనా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో డా.సందీప్ తలారి, డా. శాంతి వర్ధన్, తదితర డాక్టర్స్ బృందం పాల్గొన్నారు.

## గడపగడపకు సంక్షేమమే అజెండగా జననేత పాలన : ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

**ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



అరకు గిరిజన ప్రాంతంలో చలి తన పంజాను బలంగా విసురుతున్న నేపథ్యంలో ప్రజలంతా పొద్దెక్కేదాకా ఇళ్ళకే పరిమితమవుతున్నారు. అయితే చలి ధాటికి ఏమాత్రం వెరువక పొద్దున్నే 6గం.ల ప్రాంతంలోనే మన్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు గిరిజన నేత ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ. సంక్షేమ పథకాల హామీల నెరవేర్పులో 95 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన జననేత పాలనకు ప్రజలు హక్కును చేర్చుకుని అత్యంత ఆదరాభిమానాలు చూపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ప్రతి అవసరాన్ని తీర్చడమే అజెండగా మార్చుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ పరిపాలనను కొనసాగిస్తున్నారని అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. మండలంలోని ఏనుగురాయి సచివాలయం (10390739) పరిధిలోని ఏనుగు రాయి వనబసింగి పంచాయితీలకు చెందిన వనభసింగి, లింగపుట్టు, కొత్తూరు, చిప్పపుట్టు, తడ్డ పల్లి, తొంగికోట గ్రామాల్లో 872 గడపల్లో శనివారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హాజరై గత మూడున్నర ఏళ్లలో ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలను ఆరా తీశారు. ఇంతవరకు జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా మొత్తం 31 గిరిజన సచివాలయాలకు, గ్రామ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.20 లక్షల చొప్పున ఏపీ ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని, మిగిలిన సచి వాలయాల్లో కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవగానే నిర్దేశించిన రీతిగా రూ.20 లక్షల చొప్పున ముఖ్యమంత్రి గ్రామ అభివృద్ధి పనులకై ఆర్థిక నిధులను మంజూరు చేయ నుందని ప్రజలకు గిరిజన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హామీ ఇచ్చారు. తెల్లవారుజాము 6 గంటలు మొదలై సాయంత్రం 6 గంటల దాకా సాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గడపల వద్ద ఎమ్మెల్యేకు సాదర ఆహ్వానం పలికి తమ ఆప్యాయతను గిరిజన వాసులు కనపరిచారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిపి అరిసెల సీతమ్మ, మండల అధ్యక్షులు పాంగి మల్లికార్జున్, ఏనుగురాయి సర్పంచ్ నర్సింగ్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, పిఏసిఎస్ చైర్మన్ కూడా మత్స్యలింగం, జోలాపుట్ ఎంపిటీసీ కమల, ఎంపీటీసీ నబో, బీసీ సెల్ డైరెక్టర్: మణి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వంతల కొండలరావు, జోలాపుట్ సర్పంచ్ జనం తిరుపతి, ఎంపీడీఓ కిరణ్ కుమార్, ఏర్ఓ చెందారమేష్, సీనియర్ నాయకులు గాశిరం, జగబంధు, కొండలరావు, సన్యాసి, జయో, సాలోమోను, అప్పారావు, దాసు పులిరాజు, పెదబాబు, ఉదయ్, పిత్ బాస్, బాలరాజు, ప్రసాద్, రఘునాద్, సచివాలయం సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొయ్యూరులో 31న మినీ జాబ్ మేళా

**125 ఖాళీలు భర్తీకి మూడు సంస్థలు -జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే**

**పాడేరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

ఈ నెల 31న కొయ్యూరు మండలం శరభన్నపాలెంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మినీ జాబ్ మేళా జరుగనుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పిలుపు నిచ్చారు. శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మినీ జాబ్ మేళాలో మోహన్ స్పింటెక్స్, సెంట్రల్ ఫార్మసీ, మథర్ అండ్ ఫాథర్ హోమ్ నర్సింగ్ సర్వీసెస్ అనే మూడు సంస్థలు పాల్గొంటాయని వాటి ద్వారా 125 ఖాళీలు భర్తీ చేయనున్నారన్నారు. ఈ జాబ్ మేళాకు ఆసక్తి గల 5 నుండి 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, ఎఎన్ఎమ్, ఎంపిహెచ్‌డబ్ల్యు, జీఎన్ఎమ్, బి.ఎస్.సి నర్సింగ్ శిక్షణ పొందిన 18 నుండి 35సం.ల వయసు గల యువతీ యువకులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపిఎస్ఎస్‌డిసి.ఇన్ అనే వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, లేదా ఆ రోజు నేరుగా హాజరు కావచ్చని ఎమ్మెల్యే సూచించారు. ఎంపికైన అభ్య ర్థులు విజయవాడ, విశాఖపట్నంలలో పని చేయాల్సి ఉంటుందని, వారి అర్హతలు, ఎంపికైన సంస్థ ఆధారంగా రూ.7,500 నుండి రూ.15,000ల వరకు జీతం ఉంటుందన్నారు. ఈ మినీ జాబ్ మేళా యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పిలుపు నిచ్చారు.

## ఈ పంట నమోదు పత్రాలు తనిఖీ చేసిన డిఏఓ

**మాడుగుల అక్టోబరు 29 ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి జి.ఎస్.ఎన్.ఎస్ లీలావతి శనివారం చీడికాడ మండలంలోని జైతవరం, అప్పలరాజుపురం రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఈ పంట నమోదు చేసుకున్న రైతులు ముసాయిదా జాబితాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్న జాబితాలను పరిశీలించుకుని పంటల నమోదులో తేడాలను గమనించిన ఎడల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అభ్యంతరాలను ధరఖాస్తు రూపంలో తెలియ చేసుకోవాలని కోరారు. ఈ నెల 31న ఆఖరి తేదీ కనుక ఈ లోగా అభ్యంతరాలను విన్నవించుకోవాలని రైతుకు సూచించారు. చోడవరం ఏడిఏవి రవీంద్రనాధ్, చీడికాడ ఏవో ఇ.ఆర్.ఎ.శ్రీనివాస్‌తో పాటు వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎం.పాటు తులసీ, ఏ రమణబాబు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**ఆనందపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి వ్యక్తి చెందినట్లు పోలీసులు తెలిపారు. రాగానిగూడెం గ్రామానికి చెందిన కొల్లి రమణ (39) ఈ నెల 28న తాపీ పనులు చేయడానికి విజయనగరం, వీటి అగ్రహారం వెళ్ళాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో బస్సుపై పద్మనాభం వరకు వచ్చారు. పద్మనాభం నుండి రాగానే ఆటోలో వస్తుండగా దారిలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమణకు పక్కటెములు విరిగి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో జాయిన్ చేయగా చికిత్స పొందుతూ రమణ మృతి చెందాడు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా నాగుల చవితి

**పద్మనాభం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



నాగుల చవితి రోజున భక్తి భావంతో నాగేంద్రుని పూజిస్తే సర్వరోగాలు తొలగి దోషాలు పరిహారమౌతాయని వైస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు, నాగవంశం కార్పొరేషన్ చైర్ పర్సన్ బొడ్డు అప్పల కొండమ్మ దంపతులు అన్నారు. నాగుల చవితి పర్వదినం సందర్భంగా శనివారం స్వగ్రామం మద్దిలో సొంత వ్యవసాయ క్షేత్రంలో నాగేంద్రునికి కుటుంబసభ్యులతో కలిసి అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకుని చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు దంపతులు మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమిస్తూ, చెట్టు, పుట్ట, నింగి, నేల, నీరు వంటి ప్రకృతి ప్రసాదించిన వనరులను ఆరాధిస్తూ ప్రకృతిలో భాగమైన జీవకోటిని భక్తిశ్రద్దలతో పూజించడం మన సంస్కృతిలో భాగమన్నారు. తమ కులదేవత నాగేంద్రుడని, చిన్నతనం నుంచే తల్లి తండ్రుల శిక్షణలో నాగేంద్రుని పూజించడం తమ సంప్రదాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, నాగవంశీయులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు, మంత్రులకు, శాసనసభ్యు లకు, శాసనమండలి సభ్యులకు, వైస్సార్సీపీ నాయకులకు, కార్యకర్తలకు నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## వరి తెగుళ్లు నివారణపై అప్రమత్తంగా ఉండాలి : వ్యవసాయ శాస్త్రవేత్త భవాని



**ఆనందపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

వరి పంటకు వ్యాపించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి సీనియర్ శాస్త్రవేత్త భవాని తెలిపారు. శనివారం బోని చందక రైతు భరోసా కేంద్రాలను పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బోనీ గ్రామంలో వరి పంటను పరిశీలించి సాంబామసూరి రకంలో సుడిదోమ ఉధృతిని గమనించి ఈ దోమ ఒక దుబ్బకి నాలుగు నుంచి ఐదు దోమలను వ్యాప్తి చేస్తుందని, ఈ దోమలు గమనించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఒక ఎకరాకి పైమెట్రోజన్ 120 గ్రాములు, డైనోటేఫూరన్ 80 గ్రాములు 200 మీటర్లు నీటిలో కలిపి చేసి చుడిదోమను నివారించవచ్చురన్నారు. ఈ పంట నమోదు చేసిన రైతులు వివరాలు మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రంలో గ్రామ సచివాలయం సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగిందని పంట నమోదులో ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో ఈనెల 31 లోపల రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. భీమిలి వ్యవసాయ సంచాలకులు బి.విజయప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సంధ్యారత్న ప్రభ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్య

**ఆనందపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మండలంలో వెల్లంకి గ్రామం సమీపంలో ఉన్న నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న పొట్నూరు ముఖేష్(16) విద్యార్థి ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం పార్వతీపురం జిల్లా వీరఘట్ట మండలం, తొట్టంగి గ్రామానికి చెందిన పొట్నూరు లక్ష్మణరావు సుమతి దంపతుల కుమారుడు ముఖేష్ వెల్లంకి నారాయణ కళాశాల హాస్టల్లో ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాగుల చవితిసందర్భంగా తోటి విద్యార్థులు అందరూ ఇంటికి వెళ్ళిపోయారు. తను కూడా వాళ్ళ అమ్మకి ఫోన్ చేసి వస్తానని చెప్పగా వాళ్ళ అమ్మ మనం చవితి చేయడం లేదు. నువ్వు రానవసరం లేదు అని చెప్పారు. ఈ విషయంలో విద్యార్థి మనస్థాపనతో తన హాస్టల్ రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. తండ్రి పొట్నూరు లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూల్‌కి బీరువా వితరణ



**భీమునిపట్నం, అక్టోబర్29, ప్రభాతవార్త**

పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో తిరుమల శ్రీదేవి సభాధ్యక్షతన, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపకులు, కెఎస్ఆర్ కృష్ణారావు, రిటైర్డ్ ప్రిన్సిపల్, తమ మామైన కీర్తిశేషులు మొకర నారాయణ రావు 88వ జన్మదినాన్ని పురస్కరించుకొని స్కూల్‌కి 33 వేల విలువ కలిగిన గోద్రెజ్ కంపెనీకి చెందిన బీరువాని వితరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలిగొట్ల శ్రీరామ్ చంద్ర మూర్తి స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ స్కూల్లో ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విద్యార్థుల అభివృద్ధి లక్ష్యంగా ఉపాధ్యాయులు తమవంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. విశిష్ట అతిథి గంటా అప్పలకొండ, మూడో డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు, స్కూల్ పురోభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని విద్యార్థుల పురోగతిలో తోడ్పాటు అందిస్తామని తెలియజేశారు. ఆదర్శ హిందీ ప్రేమి మండల గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.సత్తిరాజు హిందీ మాస్టారు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి క్రీడల సెలక్షన్ పోటీలు ప్రారంభం

**భీమునిపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



విశాఖ జిల్లా విద్యా అధికారి వారి అదేశాలు మేరకు విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భీమిలి స్థానిక సెయింటాన్స్ స్కూల్ మైదానంలో క్రీడల పోటీలను శుక్రవారం భీమిలి నియోజకవర్గం వైసిపి పార్టీ ఇన్‌చార్జ్ ముత్తంశెట్టి మహేష్ జాతీయ జెండాను ఎగురవేసి ఎస్.జి.ఎఫ్ జెండాను కార్పోరేటర్ గంటా అప్పలకొండ ఎగురవేసి పోటీలను ప్రారంభించడం జరిగింది. అనంతరం ఎస్‌జిఎఫ్ సిబ్బంది విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, సెయింటెన్స్ స్కూలు యాజమాన్యం అతిథులు కు సాంప్రదాయ నృత్యాలతో సాదర స్వాగతం పలికారు. ఇన్‌చార్జ్ మహేష్ క్రీడాకారులకు కరచాలనం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కబాడ్డి, త్రోబాల్, కోకో, వాలీబాల్, బాడ్మింటన్ వాటికి సంబంధించి సెలక్షన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సెలక్షన్‌లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి మండలాల నుంచి 14 సం. నుండి 17 సం.లోపు క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ సెలెక్ట్ అయిన క్రీడాకారులు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముత్తంశెట్టి మహేష్ మాట్లాడుతూ క్రీడలు అనేవి శారీరక ఉల్లాసానికి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అంతేకాక మానసిక ప్రశాంతత చేకూరుతుందని చదువులతో పాటు విద్యార్థులలో ఉన్న నైపుణ్యతను బయటకు తీయాలంటే ఇలాంటి క్రీడలు పోటీలు నిర్వహించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొనే క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని అన్నారు. అర్హత సాధించేందుకు జరుగుతున్న ఈ క్రీడల సెలక్షన్ లకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ మహేష్‌కి పి.ఎ కోలా చంద్రశేఖర్‌కి ఎస్‌జిఎఫ్ తరుపున సెక్రటరీ వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జరుగుతున్న ఈ క్రీడల సెలక్షన్‌కి నియోజకవర్గం ఇన్‌చార్జ్ గా జోసెఫ్ కిశోర్ వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ గంటా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జ్‌లు మైలపల్లి షణ్ముఖ రావు, శిల్లా కరుణాకర్ రెడ్డి, అల్లిపిల్లి నర్సింగ్ రావు, మైలపల్లి లక్ష్మణరావు, గంటా నూకరాజు, కొండబాబు, ఎస్‌జిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్బికేలలో రైతుల జాబితా

**యలమంచిలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న రైతులందరూ ఖరీఫ్ సీజన్‌లో వారు పండించే పంటలను ఈ కర్షక్ యాప్‌లో పంటను నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ఈ కేవైసి బయోమెట్రిక్ చేయించారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీల కోసం రైతులు జాబితా ప్రదర్శించడం జరిగిందని, ఈ జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే రైతులు ఆర్బికేలలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని వ్యవసాయ అధికారి సత్యశ్యామల తెలిపారు.

## అంగరంగ వైభవంగా పంచరాత్రుల ఉత్సవాలు

**యలమంచిలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**



పట్టణంలో పంచరాత్రుల ఉత్సవాలు శనివారం నాటితో ఆడంబరంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు భూలోకమాంబ అమ్మవారి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారులను దర్శించుకున్నారు. చివరి రోజు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో యలమంచిలి ప్రధాన రహదారితో పాటుగా దిమిలి రోడ్, పాతవీధి, తులసినగర్ రోడ్డులు జనాలతో కిక్కిరిసిపోయాయి. తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద దీపావళి నుంచి నాగులచవితి వరకు ఈ వేడుకలు జరుపుతుండడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ ధర్మకర్త ఉత్సవ కమిటీ ప్రతినిధులు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు, వైస్‌చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా నిర్వహించారు. అయితే గత రెండు సంవత్సరాలు కొవిడ్ నిబంధనల నేపథ్యంలో ఆలయాల వద్ద మాత్రమే విద్యుద్దీపాలను అలంకరించి ఉత్సవాలు నిర్వహించకపోవడంతో ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడంతో యలమంచిలి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం పంచరాత్రులలో చివరి రోజు కావడంతో వేకువజాము నుంచి అమ్మవారికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లకి విశేష పూజలు జరిపారు. ఉత్సవాలలో భాగంగా దేవతామూర్తుల వేషధారణలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాలలో స్థానిక ఏబీ షాపింగ్ మాల్ లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, సిఐ గఫూర్‌లు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, యలమంచిలి శివార్లలో గల పెట్రోల్ బంక్‌ల ప్రదేశాలలో అధిక సంఖ్యలో వాహనాలు పార్క్ చేశారు. ఉత్సవాలలో ఎటువంటి అవాంతరాలు జరగకుండా ఇద్దరు సిఐలు, 10మంది ఎస్సైలు 100 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ షేక్ గఫూర్ మీడియాకి తెలియజేశారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి గాడు చిన్న కుమారుని గెలిపించాలి



**పద్మనాభం, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

పద్మనాభ మండలం పద్మనాభం జంక్షన్లో శనివారం తెలుగుదేశం పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భీమిలి నియో జకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకులు గాడు అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యకర్తలను ఉద్దేశించి ప్రతీ కార్యకర్త ప్రతి ఎమ్మెల్సీ ఓటరు వద్దకు వెళ్లి ఓటు హక్కు వినియోగం గురించి ఓటరు నమోదు గురించి తెలియపరచి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా గాడు చిన్న కుమారిని గెలిపించాలని పట్టబద్రులకు నిరుద్యోగ యువతకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని సమస్యలపై పోరాడు తారని తెలియపరచాలని కార్య కర్తలను ఉద్దేశించి చెప్పారు. ఈ కార్యక్రమానికి పద్మనాభ మండలం పార్టీ అధ్యక్షులు కే రమణ మాజీ జెడ్పిటిసి కేదాము పద్మనాభం ఎంపీటీసీ కే లక్ష్మి ఎక్స్ సర్పంచ్ సన్యాసిరావు సీనియర్ నాయకులు ఎం నందేశ్ ఎస్ పై నాయుడు భారీ సంఖ్యలో తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాంప్రదాయత ఆధునికత ప్రదర్శన

**ప్రభాతవార్త అక్టోబర్ 29 విశాఖపట్నం**

సాంప్రదాయత నుండి ఆధునికత వరకు ఫ్యాషన్ ప్రపంచానికి అద్దంపట్టే విస్తృత శ్రేణి డిజైనర్స్ ఫ్యాషన్లను సూత్రా నగరంలోని నోవాటెల్ హోటల్ నందు నవంబర్ 3,4 తేదీలలో వస్త్ర ప్రదర్శన అమ్మకాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత డిజైనర్స్ తాము రూపొందించిన ప్రత్యేక దుస్తుల అలంకరణల విన్నూతమైన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంటాయిని, వివాహాది వేడులకు ఒక ప్రత్యేకతను ప్రతిబింస్తాయని నిర్వాహకులు తెలిపారు.

శ్రీకాకుళం విజయనగరం
పార్వతీపురం మన్యం
25 Glorious years
వార్త
ఆదివారం, 30 అక్టోబర్ 2022

## ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు



**వీరఘట్టం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగులకు ఇళ్లవద్దే వైద్య సేవలందించడంతో వీరంతా ఆనందంతో ఉన్నారని వైద్యాధికారి పి.ఉమా మహేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని నడిమికెల్లి గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొని మాట్లాడారు. 104 సంచార వైద్య కేంద్రంలో రోగ నిర్ధారణ చేసే పరికరాలు ఉన్నందున రోగులకు అవసరమైతే వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎక్కువగా బిపి, షుగర్, నీరుడుకు సంబంధించిన రోగులు వచ్చారని వారికి పరీక్షలు జరిపిన అనంతరం మందులు అందజేస్తామన్నారు. 32 మంది రోగులు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారన్నారు. ఇంటింటి వైద్య సేవలను అందజేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.ఆదిలక్ష్మి, ఎఎన్ఎం పైడితల్లి, ఎంహెచ్‌పి హారిక, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**పాలకొండ, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** పార్వతీపురం మన్యం జిల్లాలో డిసెంబర్ 4,5 తేదీల్లో జరుగనున్న సిఐటియు 10వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. శనివారం పాలకొండ పట్టణంలో మండల సమన్వయకమిటీ అధ్యక్షులు బి.అమరవేణి, కార్యదర్శి రాము, కార్యవర్గ సభ్యులు కె.గౌరీశ్వరాఇ, పి.లక్ష్మి. టి.శారద, ఆర్తముడి లక్ష్మణరావు, మజ్జి వీరంనాయుడు, వైశ్రీనివాస్, బి.మాధవ్, చింతల సంజీవి, జెస్సీబాయ్ తదితరులు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీ కరణ, ప్రపంచీకరణ, ప్రవేటీకరణ విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగులు, కష్టజీవులుపై దోపిడి విధానం జరుగుతుందన్నారు. జిల్లాలో షుగర్ ఫ్యాక్టరీ, జైట్ తదితర చిన్న పరి శ్రమలు మూతపడ్డాయని, దాదాపు 20 వేల మందికి ఉపాధి పోయిందన్నారు. అంగన్వాడీ, ఎండిఎం, వెలుగు, స్కీవర్కర్ల, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత లేకుండా కట్టుబానిసలు చేస్తున్నారని, ఈ వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మహాసభలు వేదికకానున్నాయన్నారు. అన్ని రంగాల కార్మికులు కదిలి వచ్చి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## ఘనంగా నాగేంద్రబాబు జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యులు కొణిదెల నాగేంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ జనసేన నాయకులు దాసరి రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంతోష్ మహర్ణ, ఢిల్లీ బిసాయి, రోకళ్ల భాస్కర్, కలియా గౌడో, దాసరి శేఖర్, సోమేష్, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం

**– మాజీ ఎమ్మెల్యే సాయిరాజు**



**కవిటి, అక్టోబరు29 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం అందరికీ సమన్యాయం జరుగుతుందని ఇందులో ఎటువంటి సందేహమే లేదని మాజీ ఎమ్మెల్యే ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయిరాజు అన్నారు.ఈమేరకు శనివారంనాడు గడగడపకు కార్యక్రమములో బాగంగా గ్రామములోగల ఇంటింటికి వెల్లి ప్రభుత్వ పధకాలు అందుతున్న తీరు,ఇంకనూ అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలపై కూలంకుషంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హతే కొలమానం రాజకీయాలకు తోవలేదు అంటూ లెతిపారు.కనుక అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా వాలంటీర్లు,స్థానిక నాయకులు కృషిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమములో గ్రీన్ అండ్ భ్యూటీషియన్ చైర్మన్ నర్తు రామారావు,స్థానిక ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి,సర్పంచ్ సనపల జానకిరావు,మండలపరిషత్ ఉపాధ్యక్షులు పూడి నేతాజి,ఎంపిటిసి సనపల క్రిష్ణారావు, మండలకోప్షన్ పాండవ చంద్రశేఖర్, సర్పంచ్ బద్రి ప్రకాష్,బెందాళం డిల్లిబాబు,సత్యంనారాయణపాడి,సర్పంచ్ మురపాల లచ్యయ్య,ఎలమంచి నీలయ్య, ఎన్ని ఆశోక్‌లతోపాటు పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఫ్యూజన్ మైక్రోఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్

**అరసవిల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త**

ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ తమ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌ను 02 నవంబర్ 2022న తెరవనుంది. ఈఆఫర్‌లో భాగంగా ఒక్కోటి 10రూపాయల ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నారు. తాజాగా 6వేల మిలియన్ రూపాయల షేర్లను జారీ చేస్తే 13,695,466 ఈక్విటీ షేర్లను విక్రయానికి అందుబాటులో ఉంచనున్నారు. యాంర్ ఇన్వెస్టర్లు 01 నవంబర్ 2022న తమ బిడ్డింగ్ దాఖలు చేయవచ్చు. ఈ ఆఫర్ 04 నవంబర్ 2022 న ముగుస్తుంది. పది రూపాయలు ముఖ విలువ కలిగిన ప్యూజర్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ ఈక్విటీ షేర్ ప్రైస్ బ్యాండ్‌ను 350 రూపాయలు నుంచి 368 రూపాయల ధరలో స్థిరీకరించారు. కనీసం 40 ఈక్విటీ షేర్లతో తమ బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.

## పారిశుధ్యం మెరుగుకే అధిక ప్రాధాన్యత



**కోటబొమ్మాళి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మేజర్ పంచాయతీ కోటబొమ్మాళిలో పారిశుధ్యం మెరుగుకే అధిక ప్రాధాన్య ఇస్తున్నట్లు ఇఒ ఆర్.యోగేశ్వరరావు తెలిపారు. శనివారం నాగులచవితి రోజు కూడా గ్రామంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం కార్మికులతో పనులు నిర్వహించారు. ముఖ్యంగా వైశ్య కళ్యాణ మండపంకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు.

## నేటి నుంచి పిక్నిక్

**గార, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

ప్రతి ఏటా కార్తీకమాసంలో ఆదివారం నాడు వన భోజనాలు చేస్తారు. మండలంలో మొగదాలపాడు, కళింగపట్నం బీచ్‌లతో పాటు ప్రసిద్ధి చెందిన సాలిహుండంలోని కొండపైన ఉన్న బౌద్ధ స్థూపాలను సందర్శిస్తారు. ఉత్తరాంధ్ర జిల్లా నుంచి కుటుంబాలతో వచ్చి వన భోజనాలు చేసి ఆ తర్వాత సముద్ర స్నానాలు చేస్తారు. వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా గార ఎస్సై మధుసూదనరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూదం, మద్యంను పిక్నిక్ వద్ద నిషేదించారు.

## అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన



**మందస, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మంత్రి అప్పలరాజు సూచనల మేరకు ఐటిడిఎ నిధులతో కొంకాడా పుట్టి పంచాయతీలో కిల్లోయి గ్రామంలో రూ.16లక్షలు, అలాగే బొగబంద పంచాయతీ డబారుసింగి గ్రామంలో రూ.16లక్షలుతో అంగన్వాడీ భవనాలు మంజూరు చేయడం జరిగింది. ఎంపిపి దొక్కరి దానయ్య శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి సవర చంద్రమ్మ, పార్టీ అధ్యక్షులు అంగున్న సూర్యారావు, వైస్ ఎంపిపిలుసీర ప్రసాద్, కొర్నాన ఆదినారాయణ, సర్పంచ్‌లు మజ్జి కుమార్‌చంద్ర, రౌతు విజయ, దుర్యోధన, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బాడ జగన్నాయకులు, బృందావనం గౌడ్, సవర డొమ్మారు, సొంబారమ్మా వైస్ సర్పంచ్‌లు సవర రాజు, సవర బాలకృష్ణ, పులారి తవిటయ్య, గ్రామ పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అందరికి ధన్యవాదాలు తెలిపారు.

## అందరి సహకారంతో ఉన్నతస్థితికి : ఎపిఎం కూర్మారావు

**ఆమదాలవలస, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

మన ప్రభుత్వం పేదరిక నిర్మూలనలో విద్య యొక్క ఆవశ్యకతను గుర్తించి భవిత మారాలంటే బిడ్డలు మారాలి. బిడ్డలు మారాలంటే బడులు మారాలి అనే సత్యాన్ని గుర్తించి ఎన్నో విప్లవాత్మక విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టి, విద్యారంగానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా, గుణాత్మక విద్యను అందించాలన్న సదుద్దేశ్యంతో మనబడి, నాడు నేడు పథకంతో ఉన్న స్థితి నుంచి ఉన్నతమైన స్థితికి మార్చి పిల్లల చదువు కోసం ఆహ్లాదకరమైన, ఆకర్షణీయమైన వాతావరణాని కల్పిస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతిపథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు వివరించారు. ప్రభుత్వం నవశకానికి నాంది పలుకుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రతిరోజు మెనూ మార్చి రుచికరమైన నాణ్యమైన పౌష్టికాహారం అందించే ఉద్దేశ్యంతోనే వారానికి ఐదు గుడ్లు, మూడు వేరుశనగ బెల్లం చిక్కిలు పిల్లలకు అందజేస్తూ ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం అమలు పరుస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయించి వారందరికీ పథకాలపై సరైన అవగాహన కల్పించి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధితో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించేటట్లు చేయడమే ముఖ్య కర్తవ్యమని తెలిపారు.

## పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించిన బొబ్బిలి డిఎస్పీ



**వంగర, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా వంగర మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం బొబ్బిలి డిఎస్పీ బి.మోహనరావు ఆకస్మాత్తుగా విజిట్ చేసి తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లో నమోదైన నేర విభాగం కేసులు నమోదు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని, అలాగే గ్రామాల్లో శాంతి భద్రతల కోసం ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని, యువతకు మత్తు పదార్ధాలు వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని స్టేషన్ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాజాం రూరల్ సిఐ నవీన్‌కుమార్, స్థానిక ఎస్సై లోకేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

## యుపీవీసీ తయారీ సామర్థ్యంను విస్తరించిన అపర్ణ ఎంటర్‌ప్రైజెస్

**బలగ, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

సుప్రసిద్ధ బిల్డింగ్ మెటీరియల్స్ సంస్థ అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ నేడు తమ యుపీవీసీ విభాగం కోసం వృద్ధి ప్రణాళికలను విడుదల చేసింది. బాచుపల్లిలోని తమ నూతన ప్రొడక్షన్ లైన్ ప్రారంభాన్ని పురస్కరించుకుని ఈ ప్రణాళికలను వెల్లడించింది. ఈ ప్రొడక్షన్ లైన్, అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ యొక్క యుపివిసి బ్రాండ్స్ అపర్ణ వెన్‌స్టర్, ఒకోటెక్‌కు సంబంధించి యుపివిసి ప్రొఫైల్ కిటికీలు, తలుపుల డిమాండ్ తీర్చనుంది. ఈ నూతన ప్రొడక్షన్ లైన్, అపర్ణ ఎంటర్ ప్రైజెస్ యొక్క యుపీవీసీ ప్రొఫైల్ ఉత్పత్తి సామర్థ్యంను 50 శాతంకు పైగా పెంచడంతో పాటుగా ప్రస్తుతం ఉన్న 450 టన్నుల నుంచి నెలకు 700 టన్నులకు తీసుకు వెళ్లనుంది. ఈ బ్రాండ్ మరింతగా తమ ఉత్పత్తి సామర్థ్యం విస్తరించడంతో పాటుగా 2023 సంవత్సరానికి నెలకు 1100 టన్నుల యువిపిసి ప్రొఫైల్ ప్రొడక్షన్ సామర్థ్యం చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని తమ యుపీవీసీ విభాగపు ప్రణాళికలను గురించి డైరెక్టర్ టెక్నికల్ టి.చంద్రశేఖర్ చెప్పారు.

### మూడు రాజధానులపై

## సమగ్రమైన చట్టాన్ని చేసి అమలు చేయాలి




**సంతబొమ్మాళి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మూడు రాజధానులకు మద్దతు పలుకుతూ రాష్ట్రంలో అభివృద్ధి, పరిపాలన, అధికారాల వికేంద్రీకరణ జరగాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అరుణోదయ రాష్ట్ర నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, ఎఐకెయంఎస్ జిల్లా నాయకులు ఎన్.వెంకటరావు, ఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.గణేష్, కళింగసీమ సాహిత్య సంస్థ నాయకులు మామిడి కోదండరావు డిమాండ్ చేశారు. సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర తదితర గ్రామాల్లో మూడు రాజధానులకు మద్ధతుగా ప్రచార యాత్ర నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. వివక్షకుగురైన ప్రాంతాల ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీతో పాటు ఐఎఫ్‌టియు, ఎఐకెఎంఎస్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, పిఓడబ్ల్యు,పిడిఎస్‌యు ఎస్.ఎన్‌పిఎస్ ఉత్తరాంధ్ర పోరాట సమితి, కళింగసీమ సాహిత్య సంస్థ, డప్పు కళాకారుల సంఘం వంటి పలు ప్రజా సంఘాలు కోరాయి. మధ్యాంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర, సీమాంధ్ర ప్రాంతాల మధ్య అభివృద్ధిలో సమతుల్యతను పాటించడం ద్వారానే రాష్ట్రం సమైక్యంగా ఉండగలుగుతుందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను నిర్లక్ష్యం చేస్తూ అమరావతిని కేంద్రీకృత రాజధానిగా చేయడం సరి కాదన్నారు. అసమానతలు తొలగాలంటే అభివృద్ధి వికేంద్రీకరణ, పాలనా వికేంద్రీకరణ, అధికార వికేంద్రీకరణ తప్పనిసరిగా జరగాలనేది ఎప్పటినుంచో వస్తున్న ప్రధానమైన డిమాండ్‌గా వారు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో మూడు రాజధానులను ఏర్పాటు చేయాలనే కోరిక బలియంగా ముందుకు వచ్చిందన్నారు.

## హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మికి రాష్ట్ర సేవారత్న అవార్డు



**వీరఘట్టం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పని చేస్తున్న కోలక ఆదిలక్ష్మికి రాష్ట్రస్థాయిలో సేవారత్న అవార్డు లభించింది. ఈమె వైద్యరంగంలో విశష్టమైన సేవలను గుర్తించి విశాఖపట్నంకు చెందిన మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ సోషల్ సర్వీసులో భాగంగా ఈ అవార్డును ప్రధానోత్సవం చేయనున్నారు. ఈమె గ్రామీణ ప్రాంతంతో పాటు ఏజెన్సీలో కూడా గిరిజనులతో మమేకమై వైద్య రంగంలో తనదైన శైలీలో సేవలను అందించి మంచి గుర్తింపును తెచ్చుకున్నారు.వీటిని గుర్తించి వారు రాష్ట్ర స్థాయిలో సేవారత్న అవార్డుకు ఎంపిక చేశారు. ఈమెకు అవార్డు రావడం పట్ల పిహెచ్‌సి వైద్యాధికారులు ప్రదీప్‌కుమార్, ఉమామహేశ్వరి, సాయి ప్రసన్నతో పాటు ఎఎన్‌ఎంలు, పిహెచ్‌సి సిబ్బంది, 104, 108 సిబ్బంది తదితరులు అభినందనలతో ముంచెత్తారు.

## పలు గ్రామాల్లో ఘనంగా నాగులచవితి పూజలు



**సంతకవిటి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మండలంలో మందరాడ, సంతకవిటి, సోమన్నపేట, గరికిపాడు, తాలడ పలు గ్రామాల్లో నాగులచవితి పూజలు ఘనంగా నిర్వహించారు. నాగదేవతకి పుట్టలో పాలు, గుడ్లు వేస్తే చెవి నొప్పులు, నాడి కారడం వంటివి రావని గ్రామస్తుల నమ్మకం. అలాగే నాగదోషం ఉంటే పోతుందని నమ్మకం. పుట్టమన్ను చెవులకు బంగారంలా పెట్టుకోవాలట అంటే మనకు బంగారం లభిస్తుందని నమ్మకం. అందుకే భక్తిశ్రద్ధలతో నాగేంద్రునికి పుట్టలో పాలు, గుడ్లు వేసి పూజ చేశారు.

## హత్య కేసులో నిందితులు అరెస్ట్



**పాతపట్నం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** పాతపట్నం మండలం వాసి గంగుపేటకు చెందిన రావడ రాజారావు (51) హత్య గావించబడ్డాడు. తన తమ్ముడు రావాడ ఫల్గుణరావు, కుటుంబ సభ్యులు నిందితులుగా ఫిర్యాదు రావడంతో పాతపట్నం సిఐ వినోద్‌బాబు, హౌస్ ఆఫీసర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## అంబరాన్నంటిన రుద్రహోమం

**సారవకోట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

సారవకోట మండలం చీడిపూడి గ్రామంలో గ్రామ పురోహితులు విద్యోపాసకులు అయ్యప్ప గురుస్వామి, బంకుపల్లి కృష్ణభాస్కరశర్మ, దాసుబాబుల ఆధ్వర్యంలో అలమాజీ పేట గ్రామానికి చెందిన శ్రీవిద్యోపాసకులు బంకుపల్లి వెంకట భాస్కరశర్మ పర్యవేక్షణలో 27 మంది రుత్వికులతో కలిసి మృత్యుంజయ సంపుటి మహా రుద్రాభిషేకం, అలాగే నమక చమక రుద్ర హోమం పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవిద్యోపాసకులు దాసుబాబు, కృష్ణభాస్కరశర్మ, వెంకట భాస్కర శర్మలు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పరిషత్తు, మండప పూజలు, వేద స్వస్తి పలు పూజలతో ప్రారంభించి లోక కళ్యాణార్థం నమక చమక పారాయణం, అలాగే మహా రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం రుద్రహోమం నిర్వహించారు. మహారుద్రాభిషేక తదితర కార్యక్రమ తీర్థప్రసాదాలు భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**కొత్తూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కొత్తూరు మండలం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు సారిపల్లి ప్రసాదరావు సతీమణి బలద గ్రామ పంచాయతీ సర్పంచ్ సారిపల్లి భారతి ఇటీవల నివగాం సమీపంలో ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి గాయాల పాలై శ్రీకాకుళం పట్టణంలోని మెడికవర్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న సంగతి పాఠకులకు తెల్సిన విషయమే. ఈ మేరకు శనివారం స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి జిల్లా కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్న సారిపల్లి భారతిని పరామర్శించి నేరుగా ఆమెతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ సారిపల్లి భారతికి జరిగిన శస్త్రచికిత్సలు గురించి సంబంధిత వైద్యులతో మాట్లాడి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## కుమారుని జ్ఞాపకార్థం ఉచిత విద్యను అందిస్తున్న సర్పంచ్



**సోంపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మరణించిన తన కుమారుని జ్ఞాపకార్థం ఐదుగురు పేద విద్యార్థులకు ఉచితంగా చదివించడానికి ముందుకు వచ్చి ఇసకలపాలెం సర్పంచ్ తన ఉదారతను చాటుకున్నారు. సోంపేట మండలం ఇసకలపాలెం సర్పంచ్, జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బి.ఈశ్వరరావు కుమారుడు బైపల్లి హర్షిత్ ఇటీవల ఆకస్మాత్తుగా మరణించారు. ఆ అబ్బాయి జ్ఞాపకార్థం కవిటిలో గల శ్రీకళ్యాణి ఇంగ్లీష్‌మీడియం స్కూల్ నందు ఐదుగురు విద్యార్థులకు ప్రతి సంవత్సరం పుస్తకాల ఫీజు, బట్టలు అందిస్తానని కళ్యాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన నాయకులు లోళ్ల రాజేష్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జనసైనికులు బాలయ్య, కాళీ, రవి, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి పండగ



**కంచిలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కంచిలిలి మండలంలో నాగులచవితి పండగను ప్రజలందరు ఘనంగా జరుపుకున్నారు. దీపావళి పండుగ తర్వాత వచ్చిన నాగులచవితి పండగను ప్రతి ఒక్కరు పాము పుట్టల వద్ద పాలు, గుడ్లు వేసి నాగదేవతను కొలిచారు. నాగుల చవితి పండగను చేసుకుంటే ఎటువంటి దోషాలు ఉండవని, నాగదేవత నుంచి కుటుంబంకు రక్షణ ఉంటుందని అందుకోసమే ఈ పండుగను చేసుకంటున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు పుట్టల వద్ద పూజల కోసం బారులు తీరారు.

## ఈ-పంట నమోదు వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శన



**మెళియాపుట్టి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** ఈపంట నమోదు వివరాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ కొరకు ప్రదర్శించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు తెలిపారు. రైతులు విధిగా తాను వేసిన పంట యొక్క వివరాలను సరి చూసుకోవాలని తెలిపారు. ఈ పంట మన మండలంలో శతశాతం పూర్తయ్యిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈపంట వివరాలు అన్ని ప్రభుత్వ పథకాలకు, ధాన్యం కొనుగోలుకు, పంట నష్టాలకు, ఇన్సురెన్స్ మొదలగు వాటికి ప్రామాణికంగా తీసుకుంటున్నారు. రైతులు తమ పంట వివరాలను విధిగా చూసుకోవాలని తెలిపారు.

# సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాల్సిందే

**– కమిషనర్ శ్రీరాములు నాయుడు**



**విజయనగరం కార్పొరేషన్ (ప్రభాత వార్త) :** నగరంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ రెడ్డి శ్రీరాములు నాయుడు స్పష్టం చేశారు. ఈమేరకు నగరపాలక సంస్థ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగులు, ఇతర అలోహ వస్తువులు తరచూ ఏ ప్రాంతం నుంచి వస్తున్నాయి, ఎక్కడ విక్రయిస్తున్నారన్న విషయాలను ఆరా తీసి, నిఘా పెంచాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అలోహ వస్తువుల వినియోగం, విక్రయాలు నిషేధించారని చెప్పారు. అయితే ఎంత అవగాహన కల్పించినప్పటికీ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు ఇంకా సాగుతున్నట్లుగా గమనించామన్నారు. దీనిపై ఉక్కుపాదం మోపేందుకు నిఘాను ఉధృతం చేయడంతో పాటు విక్రయాలు సాగిస్తున్న వర్తకులపై భారీ జరిమానాలు విధిస్తామన్నారు. అప్పటికీ మార్పు రాకపోతే ప్లాస్టిక్ అమ్మకాలు చేస్తున్న దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే నగరంలో తడి చెత్త, పొడి చెత్త తప్పనిసరిగా వేరుచేసి సేకరించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, పారిశుద్ధ్యా పర్యవేక్షకుడు లావేటి బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల చవితి వేడుకలు



**శృంగవరపుకోట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** నాగులచవితి వేడుకలు మండల ప్రజలు శనివారం నాడు అత్యంత ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారు ఆరుగంటల నుంచే కుటుంబ సభ్యులతో పుట్ట వద్దకు చేరుకున్నారు. అనంతరం నాగేంద్రు డుకు ఇష్టమైన పాలు, చలివిడి, సిమిలి తదితర పదార్థాలను పుట్టలో వేసి పూజలు నిర్వ హించారు. అనంతరం పుట్ట వద్ద బారీ ఎత్తున బాణసంచా వెలిగించారు. ఇక కొంతమంది రైతులు పుట్టవద్ద పూజలు నిర్వహించి అనంతరం అక్కడే వనభోజనాలు చేపట్టారు. మొత్తం మీద నాగులచవితి వేడుకలు మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు.

# గత ఏడాది కంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం!



**గజపతినగరం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా గత ఏడాది కన్నా ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్ అన్నారు. శని వారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణ సిబ్బంది పనితీరు, కేసుల పురోగతి వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే జైలు వార్డులు, ప్యామిలీ కౌన్సెలింగ్ గదులను కూడా తనిఖీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది జులై నెల వరకు రోడ్డు ప్రమాదాల శాతాన్ని పరిశీలించగా గత ఏడాది కన్నా 20శాతం ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న ముందుస్తు చర్యల వలనే రోడ్డు ప్రమాదాలను తమ సిబ్బంది తగ్గించగలిగారన్నారు. ప్రమాదాలు జరిగిన చోటు కూడా మరణాల రేటు తక్కువగా ఉందన్నారు. జిల్లాలో గంజాయి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రదానంగా 11 పోలీస్టేషన్లు పరిధిలోనే గంజాయి సరఫరా జరుగుతున్నట్లు గుర్తించామని, ఇందుకు గాను ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీములను ఏర్పాటు చేశామన్నారు. దీనివలన మంచి ఫలితాలు వస్తాయని, గంజాయి అమ్మకపు దారులు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. గంజాయితో పట్టుబడే 18–22 సంవత్సరాల యువకులపై కూడా కేసులు పెడుతున్నామన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నామన్నారు. లోన్‌యాప్స్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపోయిన 24 గంటల్లో తమకు సమాచారం అందిస్తే బాదితునికి మేలు చేసే అవకాశముంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,600 పెండింగ్ కేసులు ఉన్నట్లు తెలిపారు. డ్రంకు అండ డ్రైవ్ త్రిబుల్ రైడింగ్ లపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. నిషేదిత ఖైనీ, గుట్కా అమ్మకపు దారులపై కేసులు పెడుతున్నా కోర్టులో వీడిపోతున్నాయన్నారు. అలాగే పశు అక్రమ రవాణాపై నిఘా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డిఎస్పీ మోహనరావు, సిఐ లెంక అప్పలనాయుడు, ఎస్ఐ సి.హెచ్. గంగరాజు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతా దినోత్సవ రన్

**పార్వతీపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** జాతీయ సమైక్యతా దినోత్సవ రన్ (రాష్ట్రీయ ఎక్తా దివాస్) ను 31వ తేదీన జరిగే నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్థార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవ రన్ జిల్లా క్రీడా ప్రాదికార సంస్థ ఆద్వర్యంలో జరుగుతుందని ఆయన అన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇన్‌చార్జి జిలా కలెక్టర్ ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. జూనియర్ కళాశాల మైదానం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటిడిఆఎ పెట్రోల్ బంకు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రభుత్వ కార్యాలయ భవనాల సముదాయం (ఆర్‌సిఎం) వరకు సాగుతుందని వివరించారు. ఆర్‌సిఎం వద్ద ముఖ్య అతిథులు ప్రసంగాలతో రన్ ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

**జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్**



**విజయనగరం (ప్రభాత వార్త) :** ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి, వారిని అన్ని విధాలా ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలు, వచ్చిన దరఖాస్తులు, పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల కల్పన, మహిళా పారిశ్రామక వాడ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించేందుకు వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖలు కూడా కృషి చేయాలన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖలు తమ పరిధిలోని ఔత్సాహికులను గుర్తించి, వారికి పరిశ్రమలస్థాపనపై అవగాహన కల్పించాలని సూచించారు. పిఎంఇజిపి పథకం క్రింద పరిశ్రమల స్థాపనకు 300 పైగా ధరఖాస్తులు రాగా, కేవలం 63 మాత్రమే గ్రౌండింగ్ చేయడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. వచ్చినవాటన్నిటికీ అనుమతులు, రుణాలను త్వరగా మంజూరు చేసి, పరిశ్రమలను స్థాపించేవిధంగా కృషి చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపనలో డిఆర్‌డిఏ, మెప్మా కీలక పాత్ర పోషించాలని కోరారు. మైనారిటీలకు మంజూరైన ఎండియు వాహనాన్ని మూడు రోజుల్లో గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని, మైనారిటీ శాఖను జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ పాపారావు, డిడి నాగేశ్వర్రావు, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, వ్యవసాయశాఖ జెడి తారకరామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, గ్రౌండ్ వాటర్ డిడి దుర్గాప్రసాద్, కాలుష్య నియంత్రణ శాఖ ఇఇ సుదర్శన్, ఎల్‌డిఎం శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'స్వామి' కార్యం–స్వకార్యం

**మితిమీరిన రాజ'కీ'యం – శృతిమించిన పెత్తనం – పాలకవర్గం మౌనం**

**విజయనగరం కార్పొరేషన్ (ప్రభాత వార్త) :** విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో మితిమీరిన రాజకీయ జోక్యం పెరగడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. స్వామి కార్యం–స్వకార్యం అనే రీతిలో ఏపని చేయాలన్నా కీలక నేత అనుమతి లేకుండా చేయలేని పరిస్థితులు దాపురించాయి. నగరపాలనంతా కీలక నేత కనుసన్నల్లో ఉండడంతో పాలకవర్గం ఉన్నా ఏమాత్రం ప్రయోజనం కనిపించడం లేదు. పాలనాపరమైన వ్యవహారాలతో పాటు కార్యాలయంలో తీసుకునే అంతర్గత నిర్ణయాలను కూడా ఆ కీలక నేత దృష్టికి తీసుకువెళ్లాలనే పరిస్థితులు దాపురించాయంటే నగర పాలక సంస్థ పరిపాలనలో ఆ నేత ప్రభావం ఏమేరకు ఉందో ఊహించుకోవచ్చునని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ మున్సిపల్ కార్పొరేషన్‌లో లేనివిధంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్ని విభాగాల పనితీరును పర్యవేక్షించేందుకు, అభివృద్ధి పనులపై చర్చించేందుకు వార్డు సభ్యుల (కార్పొరేటర్ల)తో కమిటీలను ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థలో చేపట్టే ఏ కార్యక్రమమైనా ఆ కీలక నేత దృష్టికి తీసుకువెళ్లిన తర్వాతే కమిటీ సమావేశాల్లో చర్చించాల్సి ఉంటుందని సాక్షాత్తు కార్పొరేటర్లే చెబుతున్నారు. పాలనాపరమైన వ్యవహారాలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై అధికారులు తీసుకునే నిర్ణయాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు స్వేచ్ఛాయుత నిర్ణయాలను నియంత్రించేందుకు పాలకవర్గ సభ్యులనే కమిటీలుగా నియమించి తమపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు పెత్తనం చెలాయిస్తున్నారనే గుసగుసలు అధికారుల నుంచి వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాజకీయ జోక్యం పెరగడంతో అన్ని విభాగాల అధికారులు నలిగిపోతున్నారు. ఫలితంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాల్లో అధికారులు స్వంతంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు.

# రెండు లారీలు ఢీ!

**– ఒకరు మృతి మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**



**బొండపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** జాతీయ రహదారి 26పై శనివారం వేకువజామున నాలుగు గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబదించి స్థానిక ఎస్.ఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ నుంచి ఒడిషాకు ఐరన్‌లోడుతో వెళుతున్న లారీతో పాటు విశాఖపట్నం నుంచి దాయ్‌గడ్ వెళుతున్న కర్రల లోడుతో వెళుతున్న లారీ వేకువజామున బోడసింగిపేట పెట్రోలు బంకుకు సమీపంలో బలంగా రెండు బలంగా రెండు ఢీ కొన్నాయని తెలిపారు. ఈ ప్రమాదంలో కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ కుమారస్వామి (30) ఇనుపకడ్డీలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. అలాగే ఇదే ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా శోంత్యాం చెందిన ఎస్.శ్రీనుతోపాటు కె.సీతారాంలు తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు క్షతగాత్రులను 108 వాహనంలో విజయనగరం కేంద్రాసుపత్రికి తరలించారు. ఇక ప్రమాదంలో క్యాబిన్‌లో చిక్కుకుని మృతి చెందిన వ్యక్తిని బయటకు తీయడానికి పోలీసులు రెండు గంటల పాటు శ్రమించి బయటకు తీశారు. ఇక రెండు లారీలు కూడా జాతీయ రహదారికి మధ్యలో ప్రమాదం జరగడంతో వాహనాలు రాకపోకలు తీవ్ర అంతరాయం కలిగింది. వేకువ జామున నాలుగు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు లారీలను ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా బయటకు తీయడానికి పోలీసులకు సమయం పట్టింది. అసలే నాగులచవితి కావడంతో స్వగ్రామాలకు వెళ్ళేందుకు చాలా మంది సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ట్రాఫిక్‌లో ఇరుకుపోయి నిరీక్షించాల్సి వచ్చింది. గజపతినగరం వైపుతో పాటు బొండపల్లి వైపు నాలుగు కిలోమీటర్లు మేర ట్రాఫిక నిలిచి పోయింది. శవాన్ని పంచనామా నిమిత్తం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఢీకొన్న లారీలు (బిపిఎల్ జెపిజి)

# ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



**వేపాడ, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** ప్రజల సమస్యలను తెలుసు కుని పరిష్కరించడమే ఈ ప్రభుత్వ ధ్యేయమని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కడుబండి ప్రతి గడపగడపకు వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారికి అందుతున్నది లేనిది ఆరా తీశారు. అలాగే నిరుపేదలు మహిళాబివృద్ధికి రైతు సంక్షేమానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. అలాగే ఈ ప్రాంత అభివృద్ధిని కోరుతూ విశాఖ రాజదానిగా సిఎం ప్రతిపాదించడం చెప్పుకోదగ్గ విషయమని దీనిని ప్రతిపక్షాలు అడ్డుకోవడం ఎంతవరకు న్యాయమో ప్రజలందరూ గ్రహించాలని సూచించారు. విశాఖ రాజదాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అలాగే ఆర్థికి అభివృద్ధి చెందవచ్చని ఆయన ప్రజల దృష్టికి తీసుకెళ్ళారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు ఇంటింటి కొళాయిలు గ్రామాభివృద్ధి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు ఇప్పటికే గ్రామంలో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయని యువకులు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సిసి రోడ్ల నిర్మాణానికి జనవరిలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రంథాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించి గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నేటివరకు ఏ ఎమ్మెల్యే అయినా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందా ఈ ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి వెళ్ళి సమస్యలు తెలుసుకోమని పంపించడం అబినందించాల్సింది పోయి విమర్శలకు దిగడం సరైన విదానం కాదని హితవు పలికారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన ముఖ్యమంత్రిని యువత ఆదర్శంగా తీసుకుని మరింత ప్రోత్సహంతో గ్రామాల అభివృద్ధికి కంకణం కట్టాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వర రావు, మండల పార్టీ అద్యక్షుడు ముమ్మలూరి జగ్గిబాబు, కోఆపరేటివ్ అద్యక్షులు వేచలపు రామ్మూర్తినాయుడు, గ్రామ సర్పంచ్ గొటివాడ దేవి, ఉప సర్పంచ్ ఖండిపల్లి పెదనాయుడు నాయకులు గండి శ్రీరామ్మూర్తి, మురిపిండి గంగరాజు, బోజంకి రామునాయుడు, జి.సత్యం నాయుడు, రావాడ వెంకటరావు, బుద్దకృష్ణ, చీపురుపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

# ఘనంగా నందెమ్మ సంబరాలు



**రామభద్రపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మండల పరిధిలో ఆరికతోట గ్రామంలో శనివారం నాగులచవితి పండగను నందెమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అందరూ కుటుంబీకులతో కలిసి పుట్టలో పాలుపోసి నాగేంద్రునికి భక్తితో కొలిచారు. అనంతరం నందెమ్మ పండగను కూడా ఉత్సవ కమిఈ అద్యక్షులు మీసాల ప్రసాదరామ అద్యక్షతన అందరూ ఊరేంగింపు సంబరం చేశారు. స్త్రీలు గౌరీమాతను తలపై మోసి భక్తిని ప్రదర్శించారు. కుటుంబాలు దీవించబడాలని పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు కోరుతున్నారు.

శ్రీకాకుళం విజయనగరం
పార్వతీపురం మన్యం
25 Glorious years
వార్త
ఆదివారం, 30 అక్టోబర్ 2022

**అశేష భక్త జనం మధ్య..**

# ఘనంగా ఖాదర్ బాబా జయంతోత్సవం

**బాబాకు చాదర్ సుగంధ సమర్పణ – భారీ కేక్ కటింగ్..దివ్యన్న సమారాధన**



**విజయనగరం (ప్రభాత వార్త) :** ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రం బాబామెట్టలో శనివారం సూఫీ సెహన్షా, సద్గురు హజరత్ సయ్యద్ బాబా ఖాదర్ వలీ 126వ జయంతోత్సవం ఘనంగా జరిగింది. ఖాదర్ బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి(ధర్మకర్త) డాక్టర్ ఎండీ ఖలీలుల్లా షా తాజ్ ఖాదరీ సాబరీ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు అలుపెరుగని అన్నదాత, మహా మానవీయులు, సూఫీ సూరీడు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా దర్గా, దర్బార్ షరీఫ్(చీమల పాడు) పీఠాధిపతి పీర్జదా ముహమ్మద్ ఖాజా మోహియుద్దీన్ షా తాజ్ ఖాదరీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి బాబా జయంతోత్సవాలను ప్రారంభించారు. చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాది మంది హిందూ భక్తులు ఖాదర్ బాబా దర్గా దర్బార్ కి బారులు తీరారు. బాబా వారికి ప్రత్యేక ప్రార్థనలు చేసి, మధ్యాహ్నం నిర్వహించిన లంగర్ ఖానాలో దివ్యన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ వేడుకల్లో నిర్విరామ ఖాదర్ బాబా సేవకులు, ప్రేమికులు, అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామీజానీ షా తాజ్ ఖాదరీ, సిద్దిక్, నయీమ్, డాక్టర్ అవసరాల శ్రీధర్, సీనియర్ జర్నలిస్ట్ ఎలిశెట్టి సురేష్, లింగాల రవికుమార్, దర్బార్ షరీఫ్ సేవా బృందం తదితరులు తమ సేవలను అందించారు. అదేవిధంగా ఖాదర్ బాబా భక్తులతో పాటు ఆయన ప్రియ శిష్యులు హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా అహ్లియా వారి శిష్య బృందాలు హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, తిరుపతి, తెనాలి, మార్టూరు, పేరిచర్ల, ఒంగోలు, ఖమ్మం, జంపనీ, విశాఖపట్నం, చీమలపాడు, జుజ్జురు, అల్లూరు, కొత్త గూడెం తదితర రాష్ట్ర నలుమూలల నుంచి, దేశ విదేశాల నుంచి తరలి వచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నగరానికి చెందిన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు దర్గా దర్బార్ కి విచ్చేసి బాబాకు ప్రార్థనలు చేశారు. శనివారం సాయంత్రం చీమలపాడు పీఠాధిపతి ఖాజా బాబు, విజయనగరం బాబా దర్గా దర్బార్ ధర్మకర్త ఖలీల్ బాబు ఆధ్వర్యంలో ముజావర్లు, భక్తులు ఖాదర్ బాబా దర్గాలో బాబాకు సుగంధ ద్రవ్యోచిత చాదర్, పూలు సమర్పించి విశ్వ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్బార్ షరీఫ్ లో అశేష భక్త జనం మధ్య ఖాదర్ బాబా పుట్టిన రోజును పురస్కరించుకుని భారీ కేకును కట్ చేసి భక్తులకి దాన్ని ప్రసాదంగా పంచి, సర్వేజన సుఖినోభవంతు అని పీఠాధిపతి కాజల్ బాబు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం రాత్రి 7 గంటలకు మొదలైన దివ్యన్న సమారాధన అర్ధరాత్రి వరకు కొనసాగింది. వేళ మంది భక్తులకు లంగర్ ఖానాలో రుచికరమైన ఆహార పదార్థాలతో విందు నిర్వహించారు. టు టౌన్ సిఐ లక్ష్మణ్ రావు నేతృత్వంలో పోలీస్ లు బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా వేడుకలు ఘనంగా జరిగాయి.

# నవజీవన్ విద్యార్థులతో చవితి పండగ



**సాలూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** సాలూరు పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న నవజీవన్‌పూర్ చిల్డ్రన్స్ హాస్టల్స్ ఆర్గనైజర్ చిక్కాల చిన్నమ్మలు ఆశ్రమంలో ఉంటున్న విద్యార్థులతో నాగులు చవితి పండగను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం కాలేజి సమీపంలో ఉన్న పుట్ట దగ్గరికి వెళ్ళి హాస్టల్లో సుమారు 80 మందికి పైగా ఆశ్రమం పొందుతున్న విద్యార్థిని విద్యార్థులతో పుట్టకు పూజలు నిర్వహించి వారితో పాలు ప్రసాదం పుట్టలో పోయించారు. అనంతరం విద్యార్థులతో వారు బాగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలని నాగదేవతకు ప్రార్థనలు చేయించారు. చిన్నమ్మలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం హాస్టల్ విద్యార్థులతో నాగులచవితి పండగ ఎంతో వేడుకగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐఆర్డీఎస్ ఎన్జీఒ చిక్కాల స్వాతిశ్రీ, సిబ్బంది, జయంతి హాస్టల్ విద్యార్థుని విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయితీ కార్యదర్శిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్



**నెల్లిమర్ల, అక్టోబరు 29 ప్రభాతవార్త :** మండలంలోని వల్లూరు గ్రామ సచివాలయ కార్యదర్శి గుండాల వెంకటేష్‌పై ఆ గ్రామ సర్పంచ్ పంచాది జయలక్ష్మి నెల్లిమర్ల పోలీసులకు శనివారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడారు. తన ప్రమేయం లేకుండా కార్యాలయాన్ని పాత భవనం నుంచి కొత్త భవనంలోనికి మార్పు చేశారని, ఇదేమని అడిగితే ఈ నెల 5వ తేదీనే మార్పు చేశామని నిర్లక్ష్యంగా చెప్పడంతో పాటు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కంది శ్రీనివాసరావు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభిం చారని చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. గ్రామ ప్రధమ పౌరురాలను, సర్పంచ్‌ను అయిన తనకు సమాచారం లేకుండా తన అనుమతి లేకుండా ఎలా కొత్త భవనంలోని మార్పు చేస్తారని ఆమె ప్రశ్నించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రామ కార్యదర్శి వెంకటేష్‌పైన, భవనాన్ని ప్రారంభించిన వైసిపి కార్యకర్తపైన చర్యలు చేపట్టాలని పోలీసులను కోరినట్లు సర్పంచ్ జయలక్ష్మి తెలిపారు. పోలీసులను కలిసిన వారిలో సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ లెంక నాగేశ్వరి, టిడిపి నాయకులు పంచాది జగన్నాథం, లెంక సన్యాసిరావు, మంగం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు!



**పాచిపెంట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి వచ్చే ఆర్.అండ్.బి రహదారిలో పాచిపెంట నుంచి జాతీయ రహదారి పనసపెద్ది, కొనవలస బోర్డర్ చెక్‌పోస్టు వరకు ఉన్న మలుపులు వచ్చే పోయే వాహనదారులకు ప్రమాదాకలు నిలయంగా మారాయి. పాచిపెంట ఎంపిడిఒ జంక్షన్ మొదలుకుని దానాల గోర్జా, రేవల్ల ఆరి కళ్ళాలు పోతలగెడ్డపోలమ్మ, చెరువు పిల్లింగ్ గుడ్డివరకు ఉన్న మలుపులు ఇరువైపులా వచ్చిన వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో ప్రయాణం చేసుకుంటున్నారు. నిత్యం ఈ రహదారి గుండా ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు జీపులు బారీ వాహనాలు తరుచూ ప్రయాణీస్తుంటాయి. అదే విధంగా మలుపులు, రోడ్డు ఇరువైపులా చెట్టు పొదల ఉండటంతో వచ్చే పోయే వాహనాలు ఎదురెదురుగా కనిపించకపోవడం వలన పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుఇరువైపులా ఉన్న చెట్టు తుప్పలు డొంకలను నరికి వేయించాలని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రం పాచిపెంట కావటంతో అనేక అవసరాల నిమిత్తం ప్రజలు ఉద్యోగులు రహదారి గుండా ప్రయాణం చేస్తుంటారు.

### నాగులచవితి పర్వదినం సందర్భంగా

## పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్ దంపతులు

అల్లిపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినం పురస్కరించుకొని ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి నాగేంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుటలో పాలు పోసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి పూర్వీకులు ఆచరించిన ఆచారాలు, సంప్రదాయాలు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవడం అందరి భాద్యత అని అన్నారు. కుటుంబ సమేతంగా జరుపుకునే విశిష్టమైన పండుగ నాగులచవితి అని అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యవంతంగా సంతోషంగా శ్రేయస్సును కలిగి ఉండాలని ఆ నాగేంద్రుని పూజించారు.

## రొమ్ము క్యాన్సర్ పట్ల అప్రమత్తం

### కేజీ హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైధిలి

అల్లిపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని రొమ్ముల్లో గడ్డలు ఏర్పడడం పరిమాణం మారినప్పుడు ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా ఆంకాలజిస్ట్‌ను చూపించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మైధిలి చెప్పారు. అక్టోబర్ నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం కావడంతో శనివారం చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారాకనగర్‌లోని హోటల్ నందు రొమ్ము క్యాన్సర్ పై ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్ కుక కేజీహెచ్ లో మెరుగైన వైద్యం లభిస్తోందని, మహిళలలు ఎప ్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రతి రెండు నుంచి ఐదేళ్లకోసారి పరీక్షలు చేయించుకుంటే రొమ్ము క్యాన్సర్ కు దూరంగా ఉండోచ్చన్నారు. కేజీహెచ్ కాన్సర్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కుమారి మాట్లాడుతూ 35ఏళ్ల తర్వాత వివామం జరిగే వారికి 55ఏళ్ళ తరువాత బహిస్టులు అగేవారికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వారు ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ మెమోగ్రఫీ చేయించుకోవాలని సూచించారు. నడక జీవశైలిలో మార్పు తెచప్పుటవడం, రొమ్ము పరిణామాలు ఎప్పటికప్పుడు గమనించడం కుటుంబంలో క్యాన్సర్ ఉంటే మరింత అప్రమత్తంగా ఉండాలని ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రొమ్ము నుండి రక్తం చీము వస్తున్న సందర్భం చర్మంలో మార్పులు కనపడుతున్న వెంటనే వైద్యులను సంప్రదించాలిని తెలిపారు. రొమ్ములో గడ్డలు వచ్చినవెంటనే ఆంకాలజిస్ట్ ను సంప్రదించాలని ఇందుకు కేజీహెచ్‌లో ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసమావేశంలో అధ్యక్షత వహించినచైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు ప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు. విదేశాల కంటే ఇండియాలో ఈ క్యాన్సర్ ఎక్కువ గా వ్యాప్తిస్తోందని చెప్పారు. వయస్సు తో సంబంధం లేకుండా క్యాన్సర్ వస్తున్నందున ప్రతి మహిళ నాన్నోగ్రం చేయించుకోవడం అద్దం ముందు నిల్చోని రొమ్ములను పరిశీలించుకోవాలని కోరారు. అనుమానం ఉన్న మహిళలు కేజీహెచ్‌లో పరీక్షలు చేయించుకోవాలని అందుకు చైతన్య స్రవంతి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డా.మైధిలి, డాక్టర్ కుమారిలను ఘనంగా సన్మానించారు. ఈసమావేశంలో చైతన్య స్రవంతి ప్రతినిధులు, రుకియాభాను, విజయ, శారద తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రొమ్ము క్యాన్సర్‌పై చతన్య స్రవంతి ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మహిళలు పింక్ చీరులు ధరించి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### త్వరలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరగనున్న

## అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విశాఖకు ఎంతో కీలకం

### విశాఖ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్

అల్లిపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త



స్వర్ణభారతి స్టేడియంలో యోనెక్స్ సన్రైజ్ ఆల్ ఇండియా సీనియర్ రంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సంబంధించిన ప్రతిక సమావేశంలో విశాఖ షట్టిల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ పాల్గొని టోర్నమెంట్ వివరాలను వివరించారు. దేశం నలుమూలల నుంచి జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. అనేకమంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, జాతీయ క్రీడాకారులతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ విశాఖకు ఎంతో ప్రాముఖ్యత పెంచుతుందని అన్నారు. తద్వారా విశాఖ నుంచి మరింత మంది క్రీడాకారులు తయారు చేయడం తమ లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు ఎసిపి చుక్క శ్రీనివాస్, సెక్రటరీ పల్లా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉషా శ్రీ తదితరులు పాల్గొన్నారు.



## నేడే ప్రతిభకు ప్రోత్సాహం

### 39 మందికి మీడియా అవార్డుల ప్రదానం -150 మంది పిల్లలకు ఉపకార వేతనాలు

### -అలరించనున్న భారీ సాంస్కృతిక కార్యక్రమాలు -ఏర్పాట్లు పూర్తి చేసిన వైజాగ్ జర్నలిస్టుల ఫోరం

అల్లిపురం అక్టోబర్ 29, ప్రభాతవార్త



వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రతీఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆదివారం 30వ తేదీన ప్రతిభకు ప్రోత్సాహం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వమించనున్నట్లు ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. శనివారం డాబా గార్డెన్స్ వీజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కార్యదర్శి దాడి రవికుమార్ అవార్డు కమిటీ చైర్మన్ ఆర్ నాగరాజు పట్నాయక్‌లతో కలిసి అవార్డులు, ఉపకార వేతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇందుకు సంబందించిన ఏర్పాట్లును ఇప్పటికే కార్యవర్గం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఉదయం నుంచి వేదికగా ఆంధ్రా యూనివర్సిటీ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగ ప్రతిభకు ప్రోత్సాహం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 150 మందికి ఉపకార వేతనాలు పంపిణీ చేయ నున్నట్లు వెల్లడించారు. పిల్లలను ప్రోత్సహించాలని దరఖాస్తు చేసిన అందరిని పరిగణలోకి తీసుకున్నామన్నారు. అనంతరం అతిధుల చేతుల మీదుగా మీడియా అవార్డులను ప్రధానం చేస్తారన్నారు. ఎంపిక కార్యక్రమంలో వివిధ అసోసియేషన్ల పలువురు పెద్దల సహకారం తీసుకున్నామన్నారు. మధ్యాహ్నం విందుభోజనం వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి విచ్చేసి జర్నలిస్టులకు శుభాశీస్సులు అందజేయగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యదర్శి దాడి రవికుమార్, మీడియా అవార్డు కమిటీ చైర్మన్ ఆర్ నాగరాజు పట్నాయక్‌లు మాట్లాడుతూ 39 మంది అవార్డు గ్రహీతలకు నగదు, మెమోంటో, ప్రశంసాపత్రాలు, నూతన వస్త్రాలు మిఠాయిలుతో పాటు ఘనసత్కారం అందజేయడం జరుగుతుందన్నారు. పిల్లలకు ఉపకార వేతనాలను అతిధుల చేతులు మీదుగా అందజేస్తామన్నారు. కావున ఈ కార్యక్రమానికి జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని వీరు కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి పిఎన్ మూర్తి కార్యవర్గ సభ్యులు ఇరోతి ఈశ్వరరావు, పివరలక్ష్మీ, ఎంఎస్‌ఆర్ ప్రసాద్, పి ధివాకర్, దొండా గిరిబాబు, డేవిడ్ గయాజ్, శేఖరమంత్రి, సనపల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ సోమవారం దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో స్పందన

అల్లిపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త

కమీషనర్, దేవాదాయ ధర్మదాయ శాఖ గొల్లపూడి విజయవాడ వారి ఆదేశముల ప్రకారం విశాఖపట్టణం జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖకు సంబంధించి అర్చకులు, ఇతర ధార్మిక సిబ్బంది మరియు ఇతరులు సమస్యల పరిష్కారానికై ప్రతి సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ స్పందన 3గంటల నుంచి 5గంటల వరకు విశాఖపట్నం జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమీషనర్ వారి కార్యాలయం (టర్నర్ సత్రం) నందు నిర్వహించుటకు నిర్ణయించడమైనది. కావున ఈ స్పందన కార్యక్రమము నందు అర్చక స్వాములు ఇతర ధార్మిక సిబ్బంది, ఇతరులు దేవాదాయ ధర్మదాయ శాఖకు సంబంధించిన ఎటువంటి సమస్యలు గాని /గ్రీవెన్సుల గాని పరిష్కారముకై హాజరుకావచ్చునని సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మధాయ శాఖ కె శిరీష ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు ఇండస్ట్రీయల్ పార్క్‌ను శంకుస్థాపన చేయనున్న మంత్రి అమర్నాధ్

అనకాపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త

పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి రూరల్ మండలం కోడూరు గ్రామపంచాయితీ పరిధిలో రాష్ట్ర పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్‌చే ఆదివారం ఉదయం 10.30 నిమిషాలకు ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాట్లుకు భూమి పూజ జరుపబడును, తదనంతరం రేబాక గ్రామ పంచాయితీలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ వారి స్కీల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించబడుతుంది.

## ఏయూతో ఎన్‌సిసిఆర్ ఎంఓయూ

### జువాలజీ విభాగంలో రీసెర్చ్ లేబరేటరీ ఏర్పాటు

ఏయూ, అక్టోబర్ 29, ప్రభాతవార్త




ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నేషనల్ సెంటర్ ఫర్ కోర్టల్ రీసెర్చ్ (ఎన్‌సిసిఆర్) అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా ఏయూ జువాలజీ విభాగంలో రీసెర్చ్ లాబరేటరీని ఏర్పాటు చేస్తారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణమోహన్ ఎన్‌సిసిఆర్ ప్రతినిధులు డాక్టర్ ప్రవకర్ మిశ్రా, డాక్టర్ శివాజీ పాత్రలు సంతకాలు చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. సమత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె శ్రీనివాసరావు, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య కె బసవయ్య, జువాలజీ విబాగాధిపతి ఆచార్య పి జానకీరామ్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు అవగాహన ఒప్పందంలో భాగంగా విద్యార్ధులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా జువాలజీ విభాగంలో ప్రత్యే పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు.

## యువత సామర్ధ్యాలను పెంపొందించే ప్రయత్నం చేస్తున్నాం

### రిస్క్ చేసే తత్వం యువత కలిగి ఉండాలి -ఎస్‌టిపిఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్

ఏయూ, అక్టోబర్ 29, ప్రభాతవార్త




ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిపిఐ) డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ శనివారం సందర్శించారు. ఉదయం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏయూతో సంయుక్తంగా ఎస్‌టిపిఐ నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎస్‌టిపిఐ ప్రాజెక్ట్ ఆఫీస్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సుమారు ఎకరం స్థలంలో ఎస్‌టిపిఐ ఇంక్యుబేషన్ సెంటర్ ను నిర్మించనుంది. విద్యార్ధులకు నైపుణ్యాలను వృద్ధి చేసే విధంగా ఈ కేంద్రం నిలుస్తుంది. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం ఎస్‌టిపిఐ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ యువత సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునే శక్తిని కలిగి ఉండాలన్నారు. యువతలో సామర్ధ్యాలను పెంపొందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఇంక్యుబేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించడం జరగుతోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వర్సిటీని పరిశ్రమలతో అనుసంధానం చేసే దిశగా పనిచేస్తున్నామన్నారు. వర్సిటీలో విభిన్న ప్రాంగణాలలో టెక్, ఫుడ్ ఫార్మ, మెరైన్ ఇంక్యుబేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్న విధానం వివరించారు. ఎస్‌టిపిఐతో భాగస్వామ్యం ఏయూ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తుందన్నారు. శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఏయూ నేడు సాదిస్తున్న ప్రగతిని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణమోహన్ మాట్లాడుతూ రెండు సంస్థలకు ఉపయుక్తంగా విద్యార్థులకు నైపుణ్యాలను పెంపోందించే దిశగా పనిచేస్తామ న్నారు. కార్యక్రమంలో ఎస్‌టిపిఐ డైరెక్టర్ సివిడి రామ్ ప్రసాద్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి సురేష్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనాగదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినం మరియు అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా అనకాపల్లి పట్టణం ఎన్‌టిఆర్ బెల్లం మార్కెట్ యార్డులో కొలువైన శ్రీ నాగదుర్గమ్మ అమ్మవారిని మాజీ శాసన సభ్యులు నియోజకవర్గం ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవరపాలెంలోని దిబ్బవీధి శ్రీ నాగేంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర స్వామి వారికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటి సభ్యులు ఆయనను సత్కరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర , పెతకంశెట్టి వెంకటరావు , వేగి కృష్ణా బాల, కర్రి మహాలక్ష్మీనాయుడు, నీలగిరి శ్రీను, కొణతాల బాల, ఉత్సవ కమిటీ చైర్మన్ బుద్ధ నాగేశ్వరరావు, సభ్యులు పొలమరశెట్టి బుజ్జి, దాడి పరదేశనాయుడు, పెంటకోట శ్రీనివాసరావు, పోతురాజు, మళ్ళ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ముడసర్లోవ పార్కులో నాగుల చవితి సందడి

### భక్తిశ్రద్ధలతో భక్తులు విశేష పూజలు

ఆరిలోవ, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినం సందర్భంగా స్థానిక 13వ వార్డు ముడసర్లోవ పార్కులో సందడి వాతావరణం కనిపించింది. పార్కు లోపలికి ఉచిన ప్రవేశం కల్పించడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు, సందర్శకులు నాగుల చవితి వేడుకలు పార్కులో ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పుట్టల వద్దకు చేరుకొని నాగేంద్రునకు పాలు, గుడ్లు ప్రసాదాలు వంటివి సమర్పించుకొని భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేశారు. భక్తులకు, సందర్శికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ తెలిపారు.

## నాగుల చవితి వేడుకల్లో మేయర్ కుటుంబం

ఆరిలోవ, అక్టోబర్ 29, ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినం సందర్భంగా శనివారం ముడసర్లోవ నర్సరీ గార్డెన్స్‌లో మేయర్ దంపతులు కుటుంబ సమేతంగా పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. నాగుల చవితిని తెలుగు వారు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకుంటారని అలాగే సర్ప దోషము నుంచి విముక్తి కలిగించాలని ఆ నాగేంద్రునికి మొక్కులు తీర్చుతారని మేయర్ తెలిపారు.

## సినీ సంగీత విభావరి

అల్లిపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



స్వరమాలిక వ్యవస్థాపకులు జి.ఆంజనేయరెడ్డి సమర్పణలో శనివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను మైమరిపించింది. ద్వారకానగర్ పౌరగ్రంధాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్‌మూర్తి జ్యోతి వెలగించి కార్యక్రమం ప్రారంభించారు. గాయకులు ఆంజనేయరెడ్డి, నాగు, జోసెఫ్, వివి చారి, రాము, బాబ్జి, హేమంత్‌కుమార్, కనకరాజు, గాయని కే భాగ్యలక్ష్మి, నీలిమ, శైలజ, నిషిత, లావణ్య, సివి రాజేశ్వరి తదితరులు హుషారు గీతాలతో ఆలపించారు.

## కోడిపందాల శిబిరంపై దాడి

### ఐదుగురు అరెస్ట్

నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని ఉపమాక శివారు అయ్యన్నపాలెం గ్రామం సమీపంలో కోడిపందాలు ఆడుతున్న శిబిరంపై నక్కపల్లి పోలీసులు శనివారం సాయంత్రం దాడిచేశారు. ఈ దాడుల్లో ఐదుగురుని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు కోళ్లు 500 నగదు స్వాధీన పర్చుకున్నామని ఎస్ఐ శిరీష తెలిపారు. పట్టుబడి ఐదుగురుని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

## సేవ్ ఉత్తరాంధ్ర పేరుతో

## విశాఖ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలు ఫలించవు

5వ పేజీ తరువాయి

అబద్దాలు, అర్ధసత్యాల ప్రచారోద్యమం జనాదరణ లేక నీరుగారిపోతోందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ భజనలో తరించే మీడియా మద్దతుతో పరువుపోయిన టీడీపీ నేతల వికృత నాట్యాల మధ్య చంద్రబాదు గారి ఫీంకారాలు ఆగడం లేదన్నారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలు చేష్టలు, ప్రకటనల వల్ల గత మూడేళ్ళుగా పెరుగుతున్న విశాఖపట్నం ప్రతిష్టకు హానీ జరుగుతుందనే ఆలోచన విజనరీ మాజీ సీఎంలో కనిపించడం లేదన్నారు. ఉత్తరాంధ్రను కాపాడతామనే పేరుతో విశాకనగరానికి కీడుఏస్తున్నామనే వాస్తవం 72 ఏళ్ళ నేత కళ్ళకు కానరావడం లేదు. తన హయాంలో రాజధాని పేరుతో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చేసిన నష్టం ఆయన మరిచిపోయారన్నారు. ఐటీ ఫార్మ వంటి రంగాలు వేగంగా విశాఖ నగరానికి విస్తరించే అవకాశాలున్న హైదరాబాద్‌ను అభివృద్ధి జరుగుతున్న నగరం అనే అర్థంలో హేపెనింగ్‌సిటీ అనేవారని గుర్తుచేశారు. అదేవిధంగా నేడు విశాఖ కూడా ప్రగతిశీల నగరంగా పరుగులు పెడుతూ మరో హేపెనింగ్ సిటీ అవుతోందని తెలిపారు. ఈ తరుణంలో నగర అభివృద్ధికి గండికొట్టడానికి ఉత్తరాంధ్ర తెలుగుదేశం నేతలను వారి నాయకుడు నిస్సుగ్గగా ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఓటమి పాలైన టీడీపీ ఏం చేయకూడదో అదే చేస్తున్నదనే వాస్తవాన్ని ఉత్తరాంధ్ర ప్రజలే కాదు అందరూ గమనిస్తున్నారని అన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచార యత్నం

### ఐస్ క్రీమ్ కొనేందుకు వెళ్ళిన బాలికపై అఘాయత్యం

### పోలీసు అదుపులో నిందితుడు

ఆరిలోవ, అక్టోబర్ 29, ప్రభాతవార్త

ఐదోవ తరగతి చదువుతున్న మైనర్ బాలికపై ఇద్దరు వ్యక్తులు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన శనివారం మద్యాహ్నం డైయిరీఫారం ఆదర్శనగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కోనేటి శ్రీనివాస్ లలిత దంపతలు గత పదేళ్ళుగా ఆదర్శనగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ పెంటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

**వీరికి ఇద్దరు కూతుర్లు ..**

ప్రభుత్వ పాఠశాలలో ఐదోవ తరగతి చదువుతున్న బాలిక శనివారం మద్యాహ్నం ఐస్ క్రీమ్ కొనేందుకు ఇంటి వద్ద నుంచి షాపునకు వెళ్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి బాలికను ఎంఆర్‌ఓ ఆఫీసుకు దారి అడిగి, మాయమాటలు చెప్పి బైక్‌పై బాలికను తీసుకొని వెళ్ళి విశాఖ వేలీ స్కూల్‌కు వెళ్ళే దారి పొదల్లో వదిలేసి పారారయ్యారు. ముఖంపై దెబ్బలు, ఒంటిపై గాయాలతో ఆ బాలిక రోడ్డు పైకి రావడంతో అటు పైగా వెళ్తున్న ఓ మహిళ బాలికను చూసి విషయం తెలుసుకుని ఇంటి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక తల్లిదండ్రులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయుగా సమాచారం అందుకున్న పోలీసులు బాలికను వైద్య పరీక్షలు నిమిత్తం కెజిహెచ్ ఆసుపత్రికి తరలించారు.

**సీసీ పుటేజ్ ద్వారా నిందితుల్ని గుర్తింపు...**

బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకునేందుకు స్వయంగా నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ స్వయంగా కేసు ఫాలో అప్ చేశారు. దిశా ఏసీపీ ప్రేమ్‌కాజల్ తక్షణమే కేసు నమోదు చేసి విచారణ జరిపి సదరు నిందుతుడ్ని సాయికుమార్‌గా గుర్తించి అదుపులో తీసుకున్నారు. ఇంతటి అఘాయత్యానికి పాల్పడిన వారిపై పోలీసులు తగిన చర్యలు కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు, స్థానిక సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు కోరుకుంటున్నారు.



నాగులచవితి సందర్భంగా మండలంలోని చినదొడ్డిగల్లు కొత్తూరు గ్రామంలో వంగలపూడి కుటుంబీకులు కలిసి భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్న దృశ్యం (నక్కపల్లి- ప్రభాతవార్త)

## వ్యవస్థలో మార్పులతో ప్రజల్లో ఆనందాలు

### అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ

### గడప గడపకు మన ప్రభుత్వంలో బ్రమ్మారథం పట్టిన గిరిజనులు

ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి సంక్షేమ పాలనను అందించడంతో ప్రజల్లో ఆనందాలు వ్యక్తం అవుతున్నాయని అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అన్నారు. మండలంలో గల వనభసింగి పంచాయితీ కేంద్రంలో పాటు చిప్పాపుట్టు, లుంగాపుట్టు, తడ్డపల్లి, టొంగికోట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే ఫాల్గుణ 246 గడపలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి అమ్మా మీ పిల్లలు చదువుకుంటున్నారా... అమ్మఒడి వస్తుందా... రైతు భరోసా వస్తుందా.. అవ్వా మీకు ఒకటో తేదీన పింఛన్ వస్తుందా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేసి ప్రభుత్వం నుంచి పొందిన పథకాలను వివరించారు. గ్రామాల్లో గిరిజనులంతా ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి బ్రమ్మారథం పట్టారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయని, గతంలో పంచాయితీ కేంద్రాలకు వెళ్లి పథకాలు పొందేవారమని ఇప్పుడు నేరుగా ఇంటికే పథకాలు అందుతున్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పలు సమస్యలను గ్రామాల్లో గిరిజనులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థలను సృష్టించి, వ్యవస్థను అధికారులను ప్రజల వద్దకే తీసుకువెళ్లి పాలన చేయడం జగనన్నకే సాధ్యమైందని, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు జవాబుదారీతనంగా నిష్పక్షపాతంగా పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని, గడప గడపలో ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషాలు వ్యక్తం చేస్తున్నారని, ఎమ్మెల్యే ఫాల్గుణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్‌ఎంపీపీ ఎస్.భాగ్యవతి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఏపివో సూరిబాబు, వైసీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, సర్పంచ్‌లు రమేష్‌లు, నరసింగరావు, లక్ష్మణ్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైసీపీ మండల నేతలు జగబంధు, కొండలరావు, పులిరాజు, జయదేవ్, సన్యాసిరావు, జగన్నాధం, దాసు, అప్పారావు, తిరుపతి, ఉదయ్, ప్రసాద్, సాధురాంలతో పాటు సచివాలయం సిబ్బంది, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాధవధార సెక్రటేరియట్‌లోని స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో పోర్టిఫైడ్ రైస్ జీసీసీ ఉత్పత్తులు, బియ్యం మళ్లింపుపై వాలంటీర్లతో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. (మాధవధార, ప్రభాతవార్త)



## అరకులోయలో భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుక

అరకులోయ అక్టోబర్ 29 ప్రభాతవార్త



అరకులోయ మం డలంలో శనివారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పండగ జరిగింది. దీపావళి అమా వాస్య తర్వాత జరు పుకునే నాగుల చవితి పండ గను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనం గా జరుపుకున్నారు. నాగుల చవితి సందర్భంగా అరకులోయతో పాటు పలు గ్రామాల్లో పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులు వేకువ జామునే నిద్రలేచి తలంటు స్నానాలు చేసి, పుట్టలు వద్దకు చేరుకొని నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పుట్టలో పాలు వేసి నాగారాధన చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు.

## ప్రారంభమైన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త



శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం మాడుగుల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. 15 రోజులు పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులను ప్రజలు దర్శనార్థం గ్రామంలో ఊరేగించి స్థానిక గౌర వీధిలో గల రామాలయంలో కొలు ఉంచుతారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించిన అనంతరం అణుపు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉత్సవాలను జయప్రదం చేసి అమ్మవారిని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.



## ఘనంగా చవితి వేడుకలు

మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త

హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే నాగుల చవితి వేడుకలు శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించుకున్నారు. అయితే ఏడాది దీపావళితో పాటు నాగుల చవితి కూడా తగులు మిగులు రావడంతో అతికొద్ది మంది మాత్రం శుక్రవారం మధ్యాహ్నం చవితి వేడుకలు నిర్వహించుకున్నారు. అత్యధికులు మాత్రం శనివారం ఉదయం 8 గంటల నుంచి పదిన్నర గంటలకు పుట్టలో పాలు వేస్తూ నాగేంద్రులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టల వద్ద చిన్నారులు ముందుకు సామాగ్రి కాల్చీతూ కేరింతలు కొట్టారు. కొన్నిచోట్ల గోమాతలను కూడా పూజించి ప్రసాదాలను అందజేశారు. మాడుగులతో పాటు మండలంలో గల అన్ని గ్రామాల్లో ఈ నాగుల చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో అనేక చోట్ల పుట్టలో కరిగిపోవడంతో వేసిన పుట్టలోనే మరల పాలు వేస్తూ నాగేంద్రునికి నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు నిర్వహించారు.

## గాయపడ్డ కార్యకర్తకు ఆర్థికసాయం

మాడుగుల అక్టోబర్ 29 ప్రభాతవార్త



మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల చీడికాడ మండలం తురువోలు గ్రామంలో ఇటీవల చెట్టుపై నుండి ప్రమాదవశాత్తూ పడిపోయి చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్త కిల్లి రమణను మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు శనివారం పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రూ.5 వేలను రమణకు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రెడ్డి సన్యాసి నాయుడు, రెడ్డి రాము, ముర్రు గంగునాయుడు, కె.గుర్రన్న, బొడ్డు కృష్ణ, గుంపెన అర్జునరావు, గొర్లె గణేష్, పాతాళం ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ రాజకీయాలకు చిరునామా మొకర నారాయణరావు

### జయంతి వేడుకల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

భీమునిపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



హుందా రాజకీయాలు చేస్తూ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న రాజకీయ చాణక్యుడు తెలుగుదేశం పార్టీ నేత స్వర్గీయ మొకర నారాయణరావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. స్వర్గీయ మొకర నారాయణరావు 88వ జయంతిని పురస్కరించుకొని భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఆయన నిలువెత్తు విగ్రహానికి భీమిలి జోన్ 3వ వార్డు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ నేటి తరానికి నాడు భీమిలిలో మొకర నారాయణరావు వేసిన రాజకీయ బీజం హుందా రాజకీయాలకు చిరునామాగా మారిందని అన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప రాజకీయ దురందరుడు మొకర నారాయణరావు అని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, వుడా డైరెక్టర్‌గా, భీమిలి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఇలా తెలుగుదేశం పార్టీ నుండి ఎన్నో పదవులు పొందినా ఎక్కడా చిన్న మచ్చకూడా లేకుండా నీతి వంతమైన రాజకీయాలను ఈ భీమిలి ప్రజలకు అందించారని గంటా నూకరాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఒకే పార్టీలో ఉంటూ రాజకీయాలకే వన్నె తెచ్చారని అన్నారు. ఎంతోమంది యువతకు భీమిలి పరిసర ప్రాంతంలో రాజకీయ ఓనమాలు నేర్పిన ద్రోణా చార్యుడు స్వర్గీయ మొకర నారాయణరావు అని గంటా నూకరాజు కొనియాడారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, మాజీ కౌన్సిలర్, సీనియర్ నాయకులు చురకల రమణ, 3వ వార్డు ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, కనకల అప్పలనాయుడు, సంకురుబుక్త జోగారావు, అప్పికొండ నూకరాజు, వాడమొదలు సత్యారావు, గండిబోయిన పోలిరాజు, నెక్కెళ్ళ వెంకటరావు, వియ్యపు పోతురాజు, కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాస్టర్, అప్పికొండ నర్సింగరావు, జరజాపు పాపారావు, కుప్పిల గురుమూర్తి, వాసుపల్లి వంశీ, శంకర్, సురేందర్, దేవుళ్ళు, తాతారావు, అప్పికొండ కుమార్, వంశీ, నాగవంశం యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు. నాగవంశీయుల ఆధ్వర్యంలో స్థానిక కాలేజీ రోడ్డులో గల మొకర నారాయణరావు విగ్రహానికి ఆరు వీధుల నాగవంశీలు కుల పెద్దలు మొకర 88వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెండవ వార్డ్ కార్పొరేటర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, ఉత్తరాంధ్ర నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షులు కంటుబుక్త రామానాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాడు చిన్నికుమారి లక్ష్మి మాట్లాడుతూ స్వర్గీయ నారాయణరావు కులం కోసం ఎంతో పాటు పడ్డారన్నారు. టిడిపిలో ఉన్నత స్థానాలు అధిరోహించి పార్టీకి ఎన్నో సేవలు అందజేశారని అన్నారు. అలాగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన సభ్యులుగా టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. కావున నాగావంశ కుటుంబ సభ్యులు నా గెలుపు కోసం తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటుభూక్త ముత్యాలరావు, కనకల సన్యాసినాయుడు, వెంకట్రావు, కంటుభూక్త జోగారావు, లచ్చుబుగత ఆది నారాయణ, కనకేశ్వరరావు, కనకల అప్పలనాయుడు, బోని సంజీవరావు, అప్పికొండ నూకరాజు, అప్పికొండ అదిబాబు, లక్ష్మిణ, అప్పికొండ బాలకృష్ణ, కనకల సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తవ్వేస్తున్న గెడ్డలు... పట్టించుకోని అధికారులు

భీమునిపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



భీమిలీలో రియల్ వ్యాపారస్తులు పలు గెడ్డలు, వాగులు కప్పి వేస్తున్నారు. స్థానిక బ్యాంకు రోడ్డులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి భూమిని కొనుగోలు చేసి గెడ్డ, వాగును తవ్వేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ చూసి చూడ నట్లు ఊరుకుంటున్నారు. పోలీసులను దగ్గర పెట్టుకొని గెడ్డను కప్పి వేస్తున్నారు. ఈ మధ్య వర్షాలకు మినీ స్టేడియం వద్ద గెడ్డ కప్పి వేయడం వల్ల చెరువులా మారింది. భీమిలీకి ప్రధానమైన కొండగడ్డ మూసివేయడతో వర్షాలు వస్తే భీమిలీ ఏమవుతుందో అని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం : ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పాడేరు, అక్టోబర్29, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పాడేరు మండలం లగిశపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని వంజంగి, ఎస్.కొత్తూరు గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వం చేస్తోన్న మేలును వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 117 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. సంక్షేమ పథకాల ద్వారా ఎంతెంత లబ్ది పొందారు? వాటితో ఎలాంటి ఉపాధిని పొందగలిగారన్న విషయాలను నేరుగా లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. కొందరు సంక్షేమ పథకాల ద్వారా వచ్చిన సొమ్ములతో భూమిని, మరికొందరు మేకలు, గొర్రెలను కొనుక్కొని వాటి ద్వారా ఉపాధి పొందుతున్న విషయాలను తెలిపారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఉపాధి పొందడం అనేది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే చూస్తున్నామని పేర్కొన్నారు. తన, తమ అనే బేధం లేకుండా అర్హులైన వారందరికీ ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లోనూ, ఈ నేలమీదకు రాని పసిబిడ్డ దగ్గర నుంచి పండు ముసలి వారి వరకూ వివిధ సంక్షేమ పథకాలను పొందుతున్నారని భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. ఒక్కో ఇంటికి అయితే రూ.4 నుంచి రూ.5 లక్షల వరకూ ఈ మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా లబ్దిపొందిన వారున్నారంటే ప్రభుత్వం నిష్పక్షపాతంగా, అవినీతి రహితంగా పారదర్శకమైన పాలన అందిస్తుందో చెప్పడానికి ఇంతకుమించిన సాక్ష్యం ఏం కావాలని ఆమె పేర్కొన్నారు. ఇప్పుడు కూడా ఇంకా అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారి ఎందుకు ఇప్పటి వరకూ పొందలేకపోయారు? అన్న దానిపై ఆరా తీసిన వెంటనే వారికి వాటిని పొందేలా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాము వెళ్లిన ప్రతి చోటా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అపూర్వమైన గౌరవం పెరిగిందని, ఆయన్నే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలనే తపన అందరిలోనూ కనిపిస్తుందని భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వంతాల బొంజుబాబు, స్థానిక ఎంపీటీసీ లకే రామ కృష్ణ పాత్రుడు, సర్పంచులు ఎస్.రాంబాబు, వి.రాంబాబు, వి.బసవన్న దొర, ఎల్.పార్వతమ్మ, ఎంపీటీసీ చిట్టెమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, వైయస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎస్. మంగ్లన్న దొర, ఎం.కన్నా పాత్రుడు, వి.దశమూర్తి, కె.సూరిబాబు, కె.బొంజుబాబు, పి.సత్యనారాయణ, బి.రాజారావు, కె.సుశీల, ఎల్.సత్యవతి, జి.రాజారావు, బొడరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్సి మోర్చా బస్తీ సంపర్క కరపత్రాలు విడుదల

### గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు

పాడేరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త



జాతీయ బీజేపీ ఆదేశాలు మేరకు రాష్ట్ర బీజేపి అధ్యక్షుడు సోము వీర్రాజు, గుడిసె దేవానంద్ నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ పార్టీని అన్నివర్గాలకు చేరువ చేయడానికి బీజేపీ ఎస్సి మోర్చా బస్తీ సంపర్క (వీధి సమావేశాలు) కార్యక్రమం అరకు జిల్లా వ్యాప్తంగా వీధి సమావేశాల ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం పాడేరు కేంద్ర బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఎస్సి మోర్చా సంపర్క అభియాన్ కరపత్రాలు బీజేపీ కోనసీమ ఎస్సి మోర్చా జోనల్ ఇన్‌ఛార్జ్ రవికుమార్ పెనుమాక ఆధ్వర్యంలో జరిగిన అరకు జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో బీజేపీ ఎస్సి మోర్చా కరపత్రాలు విడుదల సందర్భంగా రవికుమార్ పెనుమాక మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సెప్టెంబర్ 17 నుండి దేశంలో నవంబర్ 26వరకు డా.బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగం అమలు తేదీ వరకు 5000 వీధి సమావేశాలు రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఆధ్వర్యంలో ఎస్సి మోర్చా సంపర్క అభియాన్ రథయాత్ర అన్ని జిల్లాల్లో సాగుతోందని అన్నీ ఎస్సి వాడల్లో బస్తీ సమావేశం నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తామని రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, గిరిజన మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ కురుసా రాజారావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు తాంగుల సత్యవతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు లకే భాస్క ర్, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు గోపాల్ పాత్రుడు, జిల్లా ఎస్సి మోర్చా ఉపాధ్య క్షుడు చెప్పుల మనోజ్ కుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాకర చిన్నయ్య, ట్రేడర్స్ సెల్ కన్వీనర్ వానపల్లి అబ్బులు, పాల్గొన్నారు.

## నవంబర్ 1 నుంచి ఏకలవ్య పిజిటి, టిజిటి ఉపాధ్యాయ ఎంపికకు డెమో

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పాడేరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అతిధి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ధృవపత్రాల పరిశీలన పూర్తయిందని, నవంబర్ 1,2,3తేదీల్లో డెమో నిర్వహించి పోస్టులను భర్తీ చేయటం జరుగుతుందని అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ధృవపత్రాల పరిశీలన అనంతరం 366 మంది అభ్యర్థులు డెమోకు అర్హత సాధించారని, వీరందరికీ స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న ఎ.పి రెసిడెన్షియల్ పాఠశాలలో డెమో నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ ఒకటిన పిజిటి అన్ని కేటగిరీలతో పాటు టిజిటి తెలుగు, ఆంగ్లం, రెండవ తేదీన టిజిటి ఆంగ్లం, లెక్కలు, సైన్సు, సోషల్ విభాగాలకు డెమో నిర్వహిస్తామని, ఇంకనూ మిగిలి ఉన్నవారికి మూడవ తేదీన కూడా డెమో నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు. అర్హులైన అభ్యర్థులందరికీ ఫోన్ ద్వారా సమాచారం చేరవేయడం జరుగుతోందన్నారు. అర్హత సాధించినవారు ఆయా తేదీలలో డెమోకు హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

## నాడు నేడు పనులు ప్రారంభం

పాడేరు, అక్టోబర్29, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గవర్గం హుకుంపేట మండలం కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి)లో మన బడి నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాల ఆవరణంలో రూ.52.లక్షలతో చేపట్టనున్న పనులను ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమీషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ సురేష్ స్థానిక నాయకులతో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమీషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మనబడి నాడు నేడు పథకం ద్వారా పేద విద్యార్థులకు మేలు కలుగుతుందని, విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందని ఎస్టీ కమీషన్ సభ్యురాలు అన్నారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట ఎంపీపీ కూడా రాజబాబు జడ్పీటీసీ మత్యలింగం, స్థానిక సర్పంచ్ పూర్ణిమ, వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ నాయకులు నైనిసత్తిబాబు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు క్యారమ్ బోర్డుల పంపిణీ

భీమునిపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త



ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి (ఫాబ్) సభ్యురాల వడ్లమాని రమ కుమారుడు వడ్లమాని కార్తిక్ జన్మదినం సందర్భంగా మన కుటుం బం చారిటబుల్ ట్రస్టు పిల్ల లకు క్యారమ్ బోర్డు, తిను బండారాలు, ఐస్‌క్రీమ్ ఏర్పాటు చేయడం జరిగిం ది. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమి లి సభ్యులు సన్నీ కాళ్ళ, అశోక్ కట్టమూరి, పార్వతీశం గుగ్గిళ్ళ, డాక్టర్ లావణ్య కాళ్ళ పాల్గొన్నారు. మన కుటుంబం చారిటబుల్ ట్రస్ట్ పిల్లలు వడ్లమాని కార్తిక్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## హెల్మెట్ వినియోగంపై అవగాహన



మాధవధార, అక్టోబర్ 29 ప్రభాతవార్త

వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధారణ చేయాలని అవగాహన కార్యక్రమం రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం మద్దిలపాలెంకు చెందిన ఎం.బుచ్చిరాజు, వేణుగోపాలరావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పొగాకు నివారణ కార్యక్రమం

పి.ఎం.పాలెం, అక్టోబర్ 29 ప్రభాతవార్త




డా.కె.విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, విశాఖపట్నం ఆధ్వర్యంలో జాతీయ పొగాకు నివారణ కార్యక్రమం జిల్లా స్థాయి అవగాహన సదస్సు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమావేశ మందిరం నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అవగాహన సదస్సులో హెూం డిపార్టుమెంటు ఎం.సునీత రాణి, డిపార్టుమెంటు వి.రామకృష్ణ, డి.సి.ఎ. లేబర్ డిపార్టుమెంటు కె.మనో, స్టేట్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంటు కె.సురేష్ ఇన్‌స్పెక్టర్స్ ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టేట్ లీగల్ కన్సల్టెంట్ పి.శివశంకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డా.సమత, బి.నాగేశ్వరరావు, డెమో మణికుమారి, మోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ సంచుల వాడకంపై అవగాహన

ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త



ముంచంగిపుట్టు మండల కేంద్ర సంతలో ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని సర్పంచ్ సీసా సుభాష్ చంద్ర, ఎంపిటీసీ పాటుబోయి సత్యనారాయణ అదేవిధంగా గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్పి అవగాహన కల్పించడం జరిగింది. ప్లాస్టిక్ సంచులు వాడిన, అమ్మిన, రూ.50 నుండి రూ.1000ల వరకు జరిమానా విధించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

## గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు, అక్టోబర్ 29 ప్రభాతవార్త



ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా శనివారం ఏనుగురాయి సచివాలయ పరిధి వనబసింగి పంచాయితీలో వనబసింగి, లింగాపూటు, తడ్డపల్లి, చిప్పపుట్టు, టోంగికోట, కొత్తూరు గ్రామాలలో 246 గడపలను అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయం 7గం.ల నుంచి గ్రామాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకి పూలమాలలతో కుంకుమ తిలకాలతో ఆత్మీయ పలకరింపుతో ఘన స్వాగతం పలికారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సచివాల సమస్యల పరిష్కార కొరకు 20 లక్షలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గ్రామాలలో పర్యటిస్తూ ముందుగా అవ్వ తాతలకు భరోసా ఇస్తూ లబ్దిదారుల గడపకు వెళ్లి లబిదారులను నేరుగా తెలుసుకుని అందుకున్న సంక్షేమ పథకాలను వివరించారు. నీటి సమస్య గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి ఐదు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. శాసనసభ్యులు చెట్టి పాల్గుణ స్థానిక నాయకులతో మాట్లాడుతూ రానున్న 2024 ఎనికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని స్థానిక నాయకులకు సందర్భంగా తెలియజేశారు. ఎమ్మెల్యేకి గ్రామాలలో ఉన్న సిసి రోడ్లు, మంచినీటి డ్రైనేజీ వంటి సమస్యలను దరఖాస్తు రూపంలో స్థానికులు అందించారు. ఈ సమస్యలను విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు, అరిసెలు సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి మండలం ఎంపీడీవో కే, కిరణ్ కుమార్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి, మల్లికార్జునరావు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రమేష్, స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ నరసింగరావు, స్థానిక ఎంపిటిసి, సుబ్బలక్ష్మి, కమల, నబ్బోలి మాజీ ఎంపిటీసీ పార్టీ సీనియర్ నాయకులు గాసిరాం పార్టీ నేతలు, మత్స్య లింగం, జగబంధు, సన్యాసిరావు, జయదేవ్, సులేమాన్, కొండలరావు, అప్పారావు, దామోదరం, పిత్ బాస్, జగన్నాథం, తిరుపతి, బాలరాజు దేవా, సాధురాం, పులిరాజు, దాసు, ఉదయ్, ప్రసాద్, పెదబాబు హనుమంతు, రామరాజు, సింహాద్రి, బుద్ధ, నాగేష్, తిరుపతిరావు, రామారావు, పురుషోత్తం, నందన, నాగరాజు గణేశ్వరరావు, ఆనందరావు, కృష్ణారావు, ధనుర్జై, అర్జున్, వనబసింగి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, రెవిన్యూ డిపార్ట్మెంట్, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, స్థానిక విఆర్ఓ, రమేష్, కార్యకర్తలు అభిమానులు స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధల నడుమ సత్యసాయి నగర సంకీర్తన

నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త



అత్యంత భక్తి శ్రద్ధల నడుమ శనివారం ఉదయం ఉపమాక గ్రామ పుర వీధులలో నక్కపల్లి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. నక్కపల్లి సత్యసాయి సమితి సభ్యులు కక్కిరాల సురేష్, కొత్త భగవాన్, విశ్వేశ్వర రావు, నరవ నూకరాజు శర్మ (ట్రిప్ మాస్టారు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా విశేష పూజలు నిర్వహించారు. బాలవికాస్ సభ్యులు, పలు పాఠశాలల చిన్నారులు పాల్గొని ఆధ్యాత్మికత పరిమళిల్లేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుడు దవరశింగి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పండుగ

### చవితి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాబురావు

నక్కపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త



నాగుల చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో మండలంలో ఉన్న ప్రజలు శనివారం జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాల్లో పండగ వాతావరణం కనిపించింది. వారి వారి పొలాల్లో ఉన్న పుట్ల వద్దకు వెళ్లి ఆ స్వామివారికి పూజలు నిర్వహించి చవితి పండుగను ఆచరించారు. కుటుంబ సమేతంగా ఈ పండుగను జరుపుకునే విధానం విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఇలా ఉండగా ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు సమీపంలో పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు కుటుంబ సమేతంగా నాగుల చవితిని జరుపుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## భక్తి శ్రద్ధలతో చవితి పండుగ



ఆనందపురం, అక్టోబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని 26 పంచాయతీల ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పండుగను వేడుకగా జరుపుకున్నారు. వేకువ జాము నుండే పిల్లలు, పెద్దల సందడి కనిపించింది. ఈ పండుగకు ఒక ప్రత్యేకత ఉంది. పుట్టలో కోడిగుడ్లు వేసి పాలు పోయటం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం. దీన్ని తూచా తప్పకుండా అందరూ ఉపవాసాలతో నాగేంద్రుడుని జపించుకున్నారు. కొన్ని గ్రామాల్లో పుట్టలు లేకపోయినప్పటికీ కృత్రిమ పుట్టలు ఏర్పాటు చేసుకొని పూజలు అర్పించారు. అయితే వేములవలసలో భీమిలి మాజీ ఏఎంసీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు, మాజీ సర్పంచ్ కోరాడ అరుణ జ్యోతి, ప్రస్తుత ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, సాయిరాం హెూటల్ యజమాని కోరాడ సూర్యారావు ఆయన సతీమణి గున్న, సాయి దినేష్ తదితరులు నాగేంద్రుడికి మొక్కు లు తీర్చుకున్నారు. కొంతమంది శుక్రవారం నాగుల చవితి చేసుకోగా శనివారం ఉదయం 10 గంటలకు మరి కొంత మంది చేసుకున్నారు.

## డివైడర్‌ని ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి

యలమంచిలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

యలమంచిలి-అనకాపల్లి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కొక్కిరాపల్లికి చెందిన భీమిని సాయికిరణ్(21) తీవ్ర గాయాలవ్వగా కేజీహెచ్ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ ఘటనపై ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి 10:30కి యలమంచిలి నుంచి తన స్వగ్రామమైన కొక్కిరాపల్లి గ్రామానికి వెళ్లే దారిలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. వెంటనే కేజీహెచ్‌కి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సన్నీబాబు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

